అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శనివారం 25 మార్చి 2023

నర్సరీని పరిశీలించిన ప్రత్యేకాధికారి

ముథోల్ : మండలంలోని చించాల గ్రామంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి అంబాజి నర్సరీ, శ్మశాన వాటికను పరిశీలించారు. ఉదయం పది గంటలు అవుతున్నా సంబంధిత కార్యదర్శి విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత పడాలన్నారు. నర్సరీలో పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. శ్మశాన వాటికలో బాత్‌రూమ్‌లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. నీరు వథా కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అమీర్‌ఖాన్, ఏపీవో శిరీషారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

ఆదిలాబాద్‌టౌన్ : ఉద్యోగం రాలేదని మనస్థాపనతో ఆత్మహత్య చేసుకున్న యువకుని కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ నేతృత్వంలో శుక్రవారం మృతుని తండ్రి చౌహాన్ వసంతరావు వెంటబెట్టుకొని కలెక్టర్‌ను కలిశారు. కుటుంబ పరిస్థితులను దుర్గం శేఖర్ వివరించారు. మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టాలని అనుకోగా, ఆర్డీవో రాథోడ్ రమేష్ మృతుని కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీ మేరకు చిన్న కుమారుడు శ్రీకాంత్‌కు ఉద్యోగం ఇప్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని తండ్రి కలెక్టర్‌ను కోరారు.



కాంగ్రెస్ నాయకుల నిరసన దీక్ష



నవతెలంగాణ-దండేపల్లి

రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఏఐసీసీ సభ్యులు ప్రేమ్‌సాగర్ రావు పిలుపుమేరకు మండలంలోని మేదరిపేట్ బస్టాండ్ వద్ద నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోడీ నాయకత్వంలో ప్రజాస్వామ్యాన్ని కూనిచేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ తమ నాయకుడు రాహుల్ గాంధీని ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. రాహుల్ గాంధీని రాజకీయ పరంగా అణగదొక్కడానికి అక్రమ కేసులు బనాయిస్తున్నారని, గత ఎన్నికల్లో మోడీపై చేసిన వ్యాఖ్యలకు ఇప్పుడు జైలుకు పంపడం ఏంటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ యాత్ర వలన కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుండి వచ్చిన మద్దతు చూసి ఓర్వలేకనే అక్రమ అరెస్టు చేస్తున్నారని, చివరకు న్యాయమే గెలుస్తుందని అన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



నవతెలంగాణ-నార్నూర్

ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. గాదిగూడ మండలంలోని ఖడ్కి ఎస్‌సి గూడలో ఉన్న మంచి నీటి బావి మరమ్మతు పనులు నిర్వహించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరగా బావిని పరిశీలించారు. మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఖంపూర్ చిత్తగూడలో నిర్వహిస్తున్న హనుమాన్ మందిరం సప్తహ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక భావంతో సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మర్సుకోల తిరుపతి, నాయకులు కనక ప్రభాకర్, మెస్రం శేఖర్, శ్రీరాం, సర్పంచులు మాణిక్‌రావ్, మడావి చంద్రహరి, మడావి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఆర్కే-న్యూటెక్ గనిపై గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిపై 2022 సంవత్సరంలో 100 మస్టర్లు పూర్తి చేయని గైర్హాజరు ఉద్యోగులకు గని ఆవరణలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. దీనిలో ఆర్కే-7 గనుల గ్రూపు ఏజెంట్ ఎస్.సత్యనారాయణ, ఆర్కే-న్యూటెక్ గని ఎస్ఓఎం ఇ.స్వామిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు తప్పకుండా విధులకు హాజరుకావాలని సూచించారు. ప్రస్తుత ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలు కోల్పోతే ఆ కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఇకపై క్రమం తప్పకుండా ఉద్యోగులు విధులకు హాజరు కావాలని, లేకపోతే సంస్థ పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే-7 గ్రూపు సీనియర్ పీఓ ప్రకాష్‌రావు, సంక్షేమాధికారి పాల్‌స్పృజన్, జేఓ స్టాన్లీ జోన్స్, టీబీజీకేఎస్ ప్రతినిధి బుస్స రమేష్ పాల్గొన్నారు.

కేంద్రానికి వివరాలు పంపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ విపత్తు కింద కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట వివరాలను అందించడం లేదని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.10వేలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ గత ఖరీఫ్‌లో అధిక వర్షాల వల్ల జిల్లాలో లక్షాపదహారు వేల ఎకరాల్లో నష్టపోయిన పంటలకు సైతం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం పంట నష్టపోయిన రైతులకు కేంద్రం హెక్టార్‌కు రూ.13,600 నష్ట పరిహారం ఇస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పంట నష్ట పరిహారంతో పాటు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గందె విజయ్ కుమార్, శివయ్య, గన్నోజి విజయ్, సతీష్‌రెడ్డి, తోకల నరేష్, కాంత, ముఖీం, ప్రశాంత్, జైపాల్, రవీందర్ పాల్గొన్నారు.

నేటి నుండి ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమ్స్ ఉచిత శిక్షణ కోసం డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, బిసి సంక్షేమ శాఖాధికారి రాజలింగు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు కుల, ఆదాయ, ఆధార్‌కార్డ్, స్టడీ సర్టిఫికెట్లు, రెండు ఫొటోలు, టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 అప్లికేషన్ ఫారంతో స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలన్నారు. ఉచిత శిక్షణ తరగతులు 29 నుంచి ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాలకు 08732221280 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆదివాసులకు బీజేపీ తీరని ద్రోహం

- పర్యావరణం పేరుతో గిరిజనుల హక్కులు హరిస్తోంది
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఉట్నూర్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆదివాసులకు తీరని ద్రోహం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. జనాభా లెక్కల ప్రకారం గిరిజనుల సంఖ్య పెరిగిందని, దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని సీపీఐ(ఎం)తో పాటు మిగతా పార్టీలు డిమాండ్ చేసినా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా మోడీ సర్కారు ససేమిరా అంటోందని విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీపీఐ(ఎం) చేపడుతున్న జన చైతన్య యాత్ర శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రానికి చేరుకుంది. యాత్రకు పార్టీ శ్రేణులు, వివిధ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాంజీగోండ్ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బీజేపీ మతోన్మాద విధానాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ దేశ ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ రాజ్యం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, లౌకిక విలువల కోసం ఈ జన చైతన్య యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మోడీ ప్రధాని కాగానే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారని, వామపక్షాలు అడ్డం పడి పోరాటాన్ని ఉధృతం చేయడంతో పాటు 10మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దీంతో మోడీ ప్రభుత్వం వెనక్కు తగ్గిందని గుర్తు చేశారు. పర్యావరణం పేరుతో కేంద్రం కొత్త నిబంధనలు తయారు చేసిందని, వీటి ప్రకారం 1/70చట్టాన్ని నీరుగార్చి గిరిజనుల హక్కులు హరిస్తోందని మండిపడ్డారు. భూములు నేరుగా తీసుకొని అదానీ, అంబానీ, కాంట్రాక్టర్‌లకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్ల ముడి సరుకు అమ్ముకొని వెళ్లిపోతారని పర్యావరణాన్ని పట్టించుకోరని తెలిపారు. ఆదివాసులే పర్యావరణం కాపాడతారని పేర్కొన్నారు. గిరిజన హక్కుల చట్టం ప్రకారం భూమి మీద వారికే హక్కులు ఉండాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు నాలుగు రెట్లు అధికంగా ఇవ్వాల్సి ఉంటుందని, కానీ దాన్ని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేసిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా వ్యతిరేకత రావడంతో వెనక్కు తగ్గిందన్నారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ గిరిజనులను పక్కదారి పట్టిస్తూ మతపరమైన చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటున్నాయని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండి పడ్డారు. గిరిజనుల సంస్కృతి మీద ఆర్ఎస్ఎస్ బలవంతంగా హిందూ మతాన్ని రుద్దే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసుల వెనుకబాటుతనం, అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటున్నాయని చెప్పారు. ఆదివాసులకు మతం లేదని, వారు ప్రకృతిని ఆరాధిస్తారని తెలిపారు. బీజేపీ వారి మీద బలవంతంగా మతం రుద్ది ఓటు బ్యాంకుగా మల్చుకుంటోందని తెలిపారు. కేంద్రం ఉపాధి హామీ నిధుల్లోనూ భారీ కోత విధించిందని తెలిపారు. ఆదివాసులకు ఈ వాస్తవాలు చెప్పాలనే ఉద్దేశంతోనే ఈ యాత్ర చేపట్టినట్లు వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ బీజేపీ ఈ నాలుగేండ్ల కాలంలో ఆదివాసులకు చేసిందేమీ లేదని విమర్శించారు. గిరిజన యూనివర్సిటీ కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తే పోలీసులతో అణిచివేశారని తెలిపారు. జిల్లాలో ఒక్క పరిశ్రమను కూడా స్థాపించలేకపోయారని పేర్కొన్నారు. ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయం ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. యాత్రలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మీ, పి.అశయ్య, స్కైలాబ్‌బాబు, అడివయ్య, జగదీష్, బాలకృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో బీజేపీ మతోన్మాద విధానాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



కాగజ్‌నగర్‌లో బైక్ ర్యాలీ

అధైర్యపడొద్దు...అండగా ఉంటాం

- ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు



నవతెలంగాణ-దండేపల్లి

రైతన్నలు అధైర్యపడవద్దు అండగా ఉంటానని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. నష్టపోయిన మామిడి, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. వడగళ్ల వానతో జరిగిన పంట నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే నష్టపరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కౌలుకు తీసుకున్న రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. సాధారణంగా వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరాకు మూడు వేల రూపాయల మాత్రమే ఇస్తారని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదివేల రూపాయలు ప్రకటించారని తెలిపారు. ఇప్పటికే పంట నష్టం అంచనా వేసి తమకు నివేదికలు అందించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. ఆలస్యం చేయకుండా త్వరలోనే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీ పురస్కారం అందుకోవాలి

- జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు
- ఏడు పంచాయతీలకు దీన్ దయాళ్ పురస్కారాలు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని, ప్రతి పంచాయతీ దీన్ దయాళ్ పురస్కారం అందుకునేలా కృషి చేయాలని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు అన్నారు. 9అంశాల ప్రాతిపదికన ఉత్తమ పంచాయతీలకు 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్' పురస్కారాలను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అందజేశారు. కృష్ణారావు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో చేపడుతున్న పనులు, సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఉత్తమ పురస్కారాలు అందజేసిందన్నారు. గ్రామపంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులు, సేవలపై ఆన్‌లైన్ ద్వారా వివరాలు పంపించగా పోస్టల్ ద్వారా పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పేరిట పురస్కారాలు ప్రశంసాపత్రాలను పంపించిందని తెలిపారు. ఒకప్పుడు అపరిశుభ్ర పరిసరాలతో, సౌకర్యాలు లేకుండా ఉన్న పంచాయతీలు నేడు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయన్నారు. ప్రతి పల్లె మౌలిక వసతులు సమకూర్చుకొని, ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మండలంలోని ఈజ్‌గాం, వల్లకొండ, బోడపల్లి, వంజిరి, బసంతినగర్, రాంనగర్, నాగంపేట్ పంచాయతీలు పురస్కారం అందుకోవడం సంతోషకరన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు సమిష్టిగా పని చేయాలన్నారు. జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికయ్యే స్థాయికి చేరుకోవడం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సీఎం కేసీఆర్ పరిపాలనా దక్షతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరీశంకర్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సిద్ధిక్, ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

యాదాద్రి తరహాలో బాసర అభివృద్ధి

- ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే, కలెక్టర్‌తో కలిసి మంత్రి అల్లోల భూమి పూజ

నవతెలంగాణ-బాసర

యాదాద్రి తరహాలో బాసర క్షేత్రాన్ని అభివృద్ధి పరుస్తామని రాష్ట్ర అటవీ పర్యావరణ, న్యాయ దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాసర సరస్వతి అమ్మవారి గర్భాలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే విట్టల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఆలయానికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కృష్ణ శిలలతో నిర్మించే గర్భాలయ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం రూ.150 మండపంలో ఏర్పాటు చేసే బాలాయాన్ని పరిశీలించారు. ఆలయ మాస్టర్ ప్లాన్ చూసిన మంత్రి వివరాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆమోదంతో బాసర ఆలయాన్ని యాదాద్రి మాదిరిగా అభివృద్ధి పరుస్తామని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. హంపి పీఠాధిపతుల సూచనలు, సలహాలు, ఆగమ శాస్త్ర నిబంధనల మేరకు ఆలయాన్ని కృష్ణ శిలలతో నిర్మిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో రూ.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. వీటిలో 8 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 22కోట్లతో అమ్మవారి గర్భాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. మరో 50 కోట్లు అదనంగా కేటాయించాలని సీఎంకు విన్నవించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే విట్టల్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఆధ్వర్యంలో బాసర ఆలయాన్ని అభివృద్ధి చేయడం స్వర్గీయ గడ్డెన్న చిరకాల కోరిక అని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, సర్పంచ్ లక్ష్మణరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఓని నర్సింగ్‌రావు, బీదరెల్లి పిఎసిఎస్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఉమారని రమేష్, మాజీ ఆలయ పాలకవర్గ సభ్యులు సుకం రామారావు, మల్కన్న యాదవ్, కోర్వా శ్యామ్, మల్లయ్య యాదవ్, దేవేందర్, ఇంజనీరింగ్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



మండల స్థాయి జాతీయ పంచాయతీ అవార్డులు

నవతెలంగాణ-ముథోల్

ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి జాతీయ పంచాయతీ అవార్డులను అందజేశారు. మండలంలోని చించాల, కారేగాం, ఎడ్‌బిడ్, బోరిగాం, ఆష్ట, ముథోల్, మచ్కల్, బ్రహ్మణ్‌గాం, విట్టోలి గ్రామ పంచాయతీలు ఎంపికకావడంతో సంబంధిత సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ పత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, యంపీవో అమీర్‌ఖాన్, సర్పంచ్‌లు రాజేందర్, అమృత మురళి, స్వర్ణలత దత్తు, సంగీత మరభా, అశ్విని మైశాజీ, నర్సారెడ్డి, రాంరెడ్డి, సత్యగౌడ్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : దీన్ దయాల్ ఉపాధ్యాయ ఉత్తమ గ్రామ పంచాయతీలుగా మండల స్థాయి అవార్డుకు ఎంపికైన సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. జీవనోపాధి, ఆరోగ్యం, పిల్లలతో స్నేహపూర్వకం, సరిపడా నీటి వనరులు, పచ్చదనం-పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వకం వంటి తొమ్మిది విభాగాల్లో 32 గ్రామాలకుగాను ఉత్తమంగా నిలిచిన 19 గ్రామపంచాయితీలకు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేశారు. మండల కేంద్రంతో పాటు ప్యారామూర్, కంకెట గ్రామాలు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పతానీ రాధ, మండల ప్రత్యేక అధికారి శంకర్, ఎంపిడిఓ సరోజ, ఎంపిఓ తిరుపతిరెడ్డి, ఎపిఎం లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దండేపల్లి : 2021-22 సంవత్సరానికి మండలంలోని 14 గ్రామాలు ఉత్తమ ప్రతిభ కనబరిచగా జాతీయ అవార్డులు అందజేసినట్లు ఎంపీడీవో మల్లేశం తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అంశాలతో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిమ ద్వితీయ తతీయ స్థానాలు పొందిన పంచాయతీలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, తహసీల్దార్ హనుమంతరావు, వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ కుమార్, పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.



ముథోల్‌లో..



సారంగాపూర్‌లో..

అభివృద్ధి పనులకు భూమి పూజ

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని డోడర్నా నెం.5 గ్రామంలో ఉపాధి హామీ కింద రూ.3లక్షలతో శుక్రవారం సర్పంచ్ జాదవ్ సునీత గణపతి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. మురికి కాలువలు, మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణానికి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.



పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-వేమనపల్లి

పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రాపంచాయతీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రాపంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు జాడి మహేష్ మాట్లాడుతూ మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, జీఓ నెం.60 ప్రకారం మున్సిపల్ సిబ్బందికి ఇస్తున్న విధంగా వేతనాలు చెల్లించాలని, మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేసి కేటగిరి వారీగా పదోన్నతులు ఇచ్చి కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్సులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చప్పిడి తిరుపతి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఏక్తార్, కార్యదర్శి ఇరుగురాల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు సత్యం పాల్గొన్నారు.

వారసంత వేలం పాట

నవతెలంగాణ - చింతలమానేపల్లి

నూతనంగా మండలం ఏర్పాటైన అనంతరం మండల కేంద్రంలో బుధవారం నిర్వహిస్తున్న వారసంతకు శుక్రవారం ప్రత్యేక అధికారి సుధాకర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి ఆసిఫ్ అలీ ఆధ్వర్యంలో వారసంత వేలంపాట నిర్వహించారు. ఇందులో 11 మంది పాల్గొనగా, బాబాసాగర్ గ్రామానికి చెందిన జాబరి చందు రూ.90వేలకు కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో మారుతి, సురేష్, నీలాగౌడ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో న్యాయవాదుల విధులు బహిష్కరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ జూనియర్ సివిల్ కోర్టులో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా కోర్టులో లంబ సత్యనారాయణ న్యాయవాదిపై ఘట్ కేసర్ పోలీసులు చేసిన దాడులను ఖండిస్తూ విధులు బహిష్కరించినట్లు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి వేతనాలు లేకుండా కేసులు పరిష్కారంలో న్యాయ సేవలందిస్తున్న న్యాయవాదులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నమని అన్నారు. న్యాయవాదులపై దాడులు జరుగుతున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాదకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బాపురెడ్డి, జమీర్ ఖాన్, బానోత్ జగన్, చింతల గిరి, జైవంత్ రావు, వసంత రావు, చంద్రమౌళి, అశోక్, రాజు, సంగీత ఉన్నారు.

ఈ చెట్టును తొలగించండి సారూ...

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్



పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ సమీపంలో ప్రధాన దారిని ఆనుకొని ఒక భారీ చెట్టు ప్రమాదానికి నిలయంగా ఉందని పలువురు పేర్కొన్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల్లో ప్రమాదకరంగా ఉన్న ఈ చెట్టును తొలగించకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేశారు. ఈ చెట్టు కారణంగా తరుచూ వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ చెట్టును తొలగించాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసిన దానిని పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదం జరగకముందే చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

అదానీ, అంబానిపై ఈడీ, ఐటీ, సీబీఐ దాడులేవి?

- కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నంతకాలం రాష్ట్రంలో, జిల్లాలో అభివృద్ధికి ఆటంకం
- ప్రజల పక్షాన సీపీఐ(ఎం) పోరాటం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నిర్మల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

నవతెలంగాణ-నిర్మల్

దేశంలో 15 మంది అత్యధికంగా సంపన్నులు ఉన్నారని, ఆదాని, అంబాని లాంటి వారిపై బీజేపీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు ఎందుకు నిర్వహించడం లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య ప్రశ్నించారు. శుక్రవారం జన చైతన్య యాత్రలో భాగంగా అంబేద్కర్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రశ్నించే వారిపైనే ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు చేస్తూ, కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. దాడుల అనంతరం కాషాయ కండువా కప్పుకోగానే కేసులు లేకుండా కుళ్లు రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. అంతర్జాతీయంగా మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆయిల్, చమురు ఒక డ్రమ్ము ధర 150 డాలర్లు ఉండేదని, ప్రస్తుతం అది 70 డాలర్లకు చేరిందన్నారు. అటువంటప్పుడు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలే తప్ప పెంచడమేమని ప్రశ్నించారు. నిత్యావసర ధరలు పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. మరో వైపు కార్పొరేట్లకు 10 శాతం రాయితీలు ఇస్తూ పన్ను రద్దును చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ(ఎం) పార్టీ మొదటి నుండి ప్రజల పక్షంలో పనిచేస్తోందని అన్నారు. ధర్నా చౌక్ కోసం ఆందోళనలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ కార్మికులు, ఇలా స్కీం వర్కర్‌తో పాటు సంఘటిత, అసంఘటిత కార్మిక సంఘాల పక్షాన ఎర్రజెండా నేతృత్వంలో ఎన్నో ఉద్యమాలు చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. ఈ ఉద్యమ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైన బీజేపీ మతోన్మాద, మనువాద రాజకీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం రాష్ట్రంలో జిల్లాలలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు కలిగిస్తూనే ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్ రైల్వే లైన్ ఏర్పాటు చేస్తామని చెప్పి, ప్రస్తుతం ఆ ఊసే లేకుండా పోయిందన్నారు. గిరిజన యూనివర్సిటీ ఇస్తామని చెప్పి ఇప్పటికీ ప్రకటించిన దాకలాలూ లేవన్నారు. రాంజీ గొండ్ ఉద్యమ స్ఫూర్తికి నిలయమైన నిర్మల్ జిల్లాలో కనీసం రాంజీ గొండ్ స్మారక మ్యూజియం ఏర్పాటు చేయలేదన్నారు.

డీఎస్పీ బహిరంగ సభను అడ్డుకొని దురుసుగా ప్రవర్తించడం సమంజసం కాదు

జనాలలో చైతన్య నింపేందుకు ప్రజాల పక్షాన నిలుస్తూ, ఎన్నో పోరాటాలు చేస్తూ ముందుకు వెళ్తున్న సీపీఐ(ఎం) బహిరంగ సభను నిర్మల్ డీఎస్పీ అడ్డుకొని మైక్‌సెట్‌లను తీసేసి దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదని అన్నారు. సభలో బైంసాలో జరిగిన మతపరమైన అల్లర్లు, దీనికి కారణమైన బీజేపీ, ఎంఐఎంల గురించి విమర్శిస్తూ మాట్లాడే సమయంలో ఈ దౌర్జన్యానికి పాల్పడటంలో ఆంతర్యమేమని అన్నారు. ఈ దుశ్చర్యతో బీజేపీకి, బండి సంజయ్‌కు డీఎస్పీ, పోలీసులు ఏజెంట్ లాగా వ్యవహరిస్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నూతనంగా వచ్చిన కలెక్టర్ యువత కావడం అనుభవపూర్వకంగా కొంత సమయం పట్టవచ్చని, అటువంటిది కలెక్టర్ వద్దన్నాడని చెప్పి సభను అడ్డుకొని ఈ దౌర్జన్యానికి పాల్పడం ఏ మేరకు న్యాయమన్నారు. అనుభవం ఉన్న డీఎస్పీగా కలెక్టర్‌కు రాజ్యాంగ బద్దంగా అనుమతి తీసుకొని సభను నిర్వహిస్తున్నారని సర్ది చెప్పాలే తప్ప, ఇలా దౌర్జన్యానికి పాల్పడటం సరైంది కాదని అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, జగదీష్, అడివయ్య, స్కైలాబ్ బాబు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మన సురేష్, అరవింద్, నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : పేదల ఇండ్ల నిర్మాణానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నయా పైసా కూడా ఇవ్వదా అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ .వీరయ్య అన్నారు. శుక్రవారం జనచైతన్య యాత్రలో భాగంగా ఆయన ఖానాపూర్ మండలంలోని కొత్త తర్లపాడు గ్రామాన్ని జనచైతన్య బృందంతో కలిసి సందర్శించారు. కొత్త తర్లపాడు గ్రామం వద్దకు జనచైతన్య యాత్ర బృందం చేరుకోగానే ఇండ్ల స్థలాల పోరాటం నిర్వహించిన పేద ప్రజలు ఎర్రజెండాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని పలు కుటుంబాల వద్దకు వెళ్లి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల పట్టాలు ఇచ్చేంతవరకు అందరూ కలిసి ఐక్యంగా పోరాడాలని అన్నారు. పేదలు ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకున్నారని వారి ఇండ్లకు తక్షణమే పట్టాలివ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి తోడ్పడాలని అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఇండ్లు నిర్మించుకున్న పేదలందరూ ఇండ్ల పట్టాల కోసం మరో ప్రజా ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య యాత్ర బృందం సభ్యులు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పి.జయలక్ష్మి, పి ఆశయ్య, టీ స్కైలాబ్ బాబు, జగదీష్, యాత్ర టీమ్ మేనేజర్ అన్నెగంటి వెంకటేష్, బృందం నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జీలు ఆశన్న, సాయి విష్ణు జిల్లాలోని వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కడెం : బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ, ఎస్.వీరయ్య ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) చేపట్టిన జన చైతన్య యాత్ర శుక్రవారం ఉదయం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని అన్నారు. అలాగే భారతదేశ రాజ్యాంగానికి ఒక గొప్ప పేరు ఉందని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అని అన్నారు. రాజ్యాంగం విషయంలో బీజేపీ ఆర్ఎస్ఎస్‌లు కక్ష్య పూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. మనోధర్మ శాస్త్రమే వ్యవహరించాలట మనోధర్మ శాస్త్రం ఏం చెప్తుందంటే బ్రాహ్మణ అధికృతను చెబుతోంది. వర్ణ వ్యవస్థను, చతుర్వ్యవస్థను చెబుతుందని అన్నారు. ఈ చతుర్వర్ణవస్థలో దళితులకు గిరిజనులకు స్థానం లేదని అన్నారు. రాజ్యాంగ విరుద్ధమైనటువంటి చర్యలకు వ్యతిరేకంగా భారతదేశ ప్రజలు అందరూ ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని అన్నారు. అంబేద్కర్ మరణించేంతవరకు తుదిక్షణం వరకు కూడా కుల నిర్మూలనకై కృషి చేశారు. అందుకే కులతత్వానికి మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మన సురేష్, జిల్లా కమిటీ సభ్యులు డాకుర్ తిరుపతి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఖానాపూర్‌లో...


కడెంలో...

విద్యారంగ సమస్యలు టీఎస్‌యూటీఎఫ్ పోరాటాలతోనే పరిష్కారం

నవతెలంగాణ-నిర్మల్



విద్యారంగంలో నెలకొన్న సమస్యలు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌తోనే పరిష్కారం అవుతాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకట్ అన్నారు. గురువారం రాత్రి టీఎస్‌యూటీఎఫ్ నిర్మల్ శాఖ కార్యవర్గ సమావేశాన్ని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్‌లో ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బాగుల చంద్రశేఖర్, పెంబి మండల ప్రధాన కార్యదర్శి బి.శంకర్‌లు సంఘంలో టీఎస్‌యూటీఎఫ్‌లో చేరారు. వీరిని జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్, కార్యదర్శి పెంట అశోక్‌లు కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులపై చొరవచూపాలన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ అలుపు లేని పోరాటాలను చూసి సంఘంలో ఇతర సంఘాల నాయకులు, సభ్యులు చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగయ్య కుర్మె, బక్కన్న, మనోహర్ రెడ్డి, భూమన్న, రాజేందర్, గణపతి, బలి రామ్, లక్ష్మణ్, లింగారెడ్డి, అనిల్, గోవర్ధన్, రాజేశ్వర్, శ్రీనివాస్, పోశెట్టి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ఐటీడీఏ ఏరియాలోని మారుమూల గ్రామాల్లో నివాసం ఉండే ఆదివాసీ గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికి ఐటీడీఏలోని ఈఈ భీంరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూసం సచిన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రోడ్డు సౌకర్యం లేని ఆదివాసీ గూడాలు చాలా ఉన్నాయని అన్నారు. ఇందులో భాగంగా మండలంలోని నర్సాపూర్ (బి) గ్రామపంచాయతీ పరిధిలోని ఆడమాన్‌గూడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సరైన రోడ్డు సౌకర్యాలు లేకపోవడం వర్షకాలంలో ఆదివాసులు పడుతున్న బాధలు అన్ని ఇన్ని కావని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రోడ్డు లేకపోవడంతో అత్యావసర సమయంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉందని అన్నారు. రోడ్డు లేకపోవడంతో ప్రాణాలు పోయిన సంఘటనలు గతంలో అనేకంగా ఉన్నాయని అన్నారు. వాగులు, వంకలు దాటి జీవనం కొనసాగిస్తున్న గ్రామాలకు సైతం వాగులపై వంతెనలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-గుడిహత్నూర్

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ నాయకుడు, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గురూజ్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని అన్నారు. ఆయన వెంట సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తిరుమలగౌడ్, నాయకులు దేవేందర్ రెడ్డి, శేఖర్, గణేష్ క్రీడాకారులు ఉన్నారు.

శ్మశాన వాటిక నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని శివాజి చౌక్ హిందూ శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న స్నానపు గదులను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మంచిర్యాల చౌరస్తా, శివాజిచౌక్ హిందూ శ్మశాన వాటిక 3 జాతీయ రహదారులను అనుకోని పట్టణంలోని దాదాపు 12 నుండి 16 వార్డులకు చెందిన వారు దహన సంస్కారాలకు వస్తుంటారని అన్నారు. నాలుగు బర్నింగ్ ప్లాట్ ఫామ్స్, సిట్టింగ్ హాల్స్, స్త్రీ, పురుషులకు స్నానపు గదులు, మంచి నీటి ట్యాంక్, స్వాగత తోరణం, పరమశివుని ప్రతిమ, విద్యుత్ దీపాలు, దహన సంస్కారాలకు వచ్చే ప్రజానికానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాలుగా సదుపాయాలతో మోడల్‌గా నిర్మాణాం చేపడుతున్నామని అన్నారు. చైర్మెన్ వెంట కౌన్సిలర్ లక్కాకుల నరహరి, మహాలక్ష్మి ఆలయ చైర్మెన్ కొడుకుల గంగాధర్, మాజీ కౌన్సిలర్ పతికే శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఆవిష్కరణలకు పెద్దపీట వేయాలి

నవతెలంగాణ-బాసర



ఆవిష్కరణలకు పెద్దపీట వేయాలని ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం అస్సాం రాష్ట్రంలో గౌహతిలో 97వ వార్షిక జాతీయ సమావేశంలో వీసీ వెంకటరమణ పాల్గొని మాట్లాడుతూ 21వ శతాబ్దంలో ఉన్నత విద్య విధానంలో పరివర్తనాత్మక సంస్కరణలు అవసరమని అన్నారు. భారతదేశం జ్ఞాన భరిత సమాజంగా తీర్చిదిద్దడంలో నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. 21వ శతాబ్దం అనుగుణంగా నేషనల్ కరిక్యులర్ ఫ్రేమ్ వర్క్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ పేరుతో ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విద్యార్థులు సాంకేతిక, విజ్ఞాన శాస్త్రాల పట్ల అభిరుచిని, గణిత శాస్త్ర సంబంధిత ఆలోచనల సరళినీ, నేర్చుకోవడం, ప్రశ్నించడం, పరిష్కరించడం అనే మూడు విషయాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. అంతేకాకుండా స్టడీస్‌కి ప్రాధాన్యం ఇవ్వడం వలన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చుని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తిని 2035వ సంవత్సరాని కల్లా 50 శాతానికి పెంచే విధంగా సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతర్జాతీయ విద్యాసంస్థలతో అవగాహన ఒప్పంద కార్టెక్నాలజీ చెప్పడం వలన ప్రపంచంలో పోటీ పడటానికి భారతీయ విద్యార్థులను తయారు చేయవచ్చని తెలిపారు. ఆర్జీయూకేటీ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యలో వస్తున్న మార్పులను పరిచయం చేసేందుకు యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మేఘాలయ సంస్థతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంటామని వీసీ వెంకటరమణ తెలిపారు. సమావేశంలో ఆయా రాష్ట్రాలకు చెందిన యూనివర్సిటీల వీసీలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కేసులు, జైలు కొత్తేమీ కాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రజల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు కేసులు, జైలుకు వెళ్లడం ఇదేమి కొత్త కాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటిష్ వారిని ఎదిరించి అనేక మంది నాయకులు జైలుకు వెళ్లిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ దేనని గుర్తు చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీని ఎంపీ పదవి నుండి వేటు వేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ ఇటీవల కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడు యాత్రకు ప్రజల నుండి వచ్చిన ఆధరణ చూసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓర్వలేకపోతుందని అన్నారు. తమ నాయకుడిపై ఎన్ని కేసులు పెట్టి జైలుకు పంపించిన కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. దేశ సంపదను ఆదానీ, అంబానీలకు దోచి పెడుతున్న, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ తీరును వ్యతిరేకిస్తూ మాట్లాడిన రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ కక్షగట్టారని ధ్వజమెత్తారు. సమావేశంలో మాజీ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, దీపక్ రావు, గంగన్న, కన్య ప్రభాకర్ రెడ్డి, ఇమ్రాన్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్‌రెడ్డి ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-గుడిహత్నూర్

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ అధికారి, జూనియర్ సివిల్ జడ్జి బి.హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పూనగూడ కేజీబీవీ పాఠశాలలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉచిత న్యాయ సహాయం, గృహహింస చట్టం, మెయింటెనెన్స్, న్యాయ సేవా సంస్థ అందించే సేవలతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వాహన చట్టంతో పాటు పలు చట్టాలపై గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్, న్యాయవాదులు కుమ్మరి విజయ్, ఆడెపు హరీష్, కేజీబీవీ ఎస్ఓ లావణ్య, విద్యార్థులు, ఉపాధ్యాయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించిన నవాబ్‌పేట్ యువకుడు


నిల్చున్న వారిలో మధ్యలో ఉన్న క్రీడాకారుడు

నవతెలంగాణ-కడెం

జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి బ్రౌన్ మెడల్ సాధించిన మండలంలోని నవాబ్‌పేట్ గ్రామానికి చెందిన రాజన్న చంద్రకళ దంపతుల కుమారుడు వెంకటేష్ శుక్రవారం పలువురు అభినందించారు. రైతు కుటుంబం నుండి రాజస్థాన్ జైపూర్‌లో జరిగిన మెన్స్ స్మాష్ రాకెట్ సీనియర్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి టీంలో కీలక పాత్ర పోషించి, బ్రౌన్స్ మెడల్‌ని గెలుచుకున్నాడు. ఈనెల 15, 16, 17 తేదీల్లో రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగినటువంటి సీనియర్స్ స్మాష్ రాకెట్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున వెంకటేష్ ఉత్తమ ప్రతిభను కనబర్చి టీంలో కీలక పాత్ర పోషించారు. జాతీయస్థాయిలో బ్రౌన్స్ మెడల్‌ని గెలుచుకున్నాడు. వీరిని తెలంగాణ స్మాష్ రాకెట్ సెక్రటరీ పులి మధు అభినందించి, సత్కరించారు. నవాబ్‌పేట్ గ్రామానికి చెందిన వెంకటేష్‌కి రాష్ట్రస్థాయిలో మెడల్ రావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పల్లెల అభివృద్ధిలో తెలంగాణ ముందంజ

నవతెలంగాణ-ఖానాపూర్

పల్లెలు అభివృద్ధి చెందడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఆమె ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంపై వివక్ష చూపుతూ తెలంగాణ రాష్ట్రనికి రావాల్సిన నిధులను మంజూరు చేయకున్న అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా పల్లెలు నిలిచాయని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. అనంతరం ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్‌లను, కార్యదర్శులను ఆమె అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పెండింగ్‌లో ఉన్న సప్లమెంటరీ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న సప్లమెంటరీ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు విడుదల చేయాలని అన్నారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రాంట్ ఇన్ ఏయిడ్ ఉపాధ్యాయులు వేతనాలు వెంటనే చెల్లించాలని అన్నారు. అనంతరం జిల్లా ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ సంఘం సభ్యులు అశోక్, స్వామి, శ్రీనివాస్, వృక్రోధర్, రియాజ్, సుగుణ పాల్గొన్నారు.

నిరుద్యోగ జేఏసీ నాయకులను అరెస్టు అన్యాయం

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరగడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగుల విద్యార్థి జేఏసీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరైంది కాదని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు రసముల్లా అశోక్‌లు అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేఏసీ ఆధ్వర్యంలో శాంతి యుతంగా నిరసన దీక్షా చేసే వారిని అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. నిరుద్యోగులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నిరుద్యోగులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ తక్షణమే టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని అన్నారు. అంతేకాకుండా ఉద్యోగ నియామకాలు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీలో అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సారంగాపూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా రవీందర్

నవతెలంగాణ-సారంగాపూర్

మండల డిప్యూటీ తహసీల్దార్‌గా రవీందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ముథోల్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. బదిలీపై సారంగాపూర్ మండలానికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన సంతోష్ మామడ మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌ను రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్స్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వీఓఏల సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-వేమనపల్లి

వీఓఏలను ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ నాయకులు శుక్రవారం ఏపీఎం ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో గ్రామ పరిధిలో పనిచేస్తున్న వీఓఏలకు గౌరవ వేతనం రూ.3900 ప్రభుత్వం చెల్లిస్తుందని, కనీస అవసరాలకు కూడా ఈ వేతనం సరిపోవడం లేదని వాపోయారు. అన్ని రకాల పనులను నిలిపివేస్తూ ఏప్రిల్ 2 వరకు సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26000 చెల్లించాలని, వీఓఏలకు రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులు అయిన వీఓఏలకి సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే నిరవధిక సమ్మె నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జిల్లపల్లి వెంకటి, కార్యదర్శి రషీద, కోశాధికారి మానేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పోషణ పక్షం

నవతెలంగాణ-తాండూర్

పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్సాపూర్, మాదారం గ్రామపంచాయతీల్లో అన్నప్రసన, కేజీబీవీ తాండూర్, కాజీపేట పాఠశాలల్లో విద్యార్థులకు బెల్లంపల్లి సీడీపీఓ ఉమాదేవి సూపర్‌వైజర్ మమతతో కలిసి మిల్లెట్స్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిల్లేట్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. రక్త హీనత, ఐరన్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వరూప నర్సాపూర్ సర్పంచ్ కుర్సెంగ జంగుబాయ్, కేజీబీవీ స్టాఫ్, అంగన్వాడీ టీచర్లు శారద, విజయలక్ష్మి, జమున, సీత, లక్ష్మీ, విజయ, కరుణ, అనసూర్య, మీనా, సువర్ణ, తిరుమల, యదలక్ష్మి పాల్గొన్నారు.



రైతులకు భరోసా రైతు బీమా

- జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన రైతు బీమా అన్నదాతలకు భరోసా కల్పిస్తోందని జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మండలంలోని నామనగర్ గ్రామానికి చెందిన కొట్రంగి సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆయన కుటుంబానికి రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్‌తో కలిసి కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పట్టా పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతు పేరు మీద ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తూ రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించిందని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తు ఏ కారణం చేతనైన రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందుతుందన్నారు. బీమా చెక్కును అందజేసిన జెడ్పీ వైస్ చైర్మన్‌కు సోమయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమోద్, ఏఓ రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, మహెబూబ్, నాయకులు మౌల్కార్ లక్ష్మణ్, కల్లెపల్లి రాజన్న, దర్ని రామన్న పాల్గొన్నారు.

26న సీపీఐ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 26 ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు సీపీఐ ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కలందర్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ, జాతీయ కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవని శంకర్ హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాల పని తీరుపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఉంటుందన్నరు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని చట్టాలను తుంగలో తొక్కి నిరంకుశ ధోరణతో వ్యవహరిస్తున్నదన్నరు. ఈ సమావేశం ద్వారా ప్రజలను ఉత్తేజపరుస్తూ ముందుకు కదిలే విధంగా కార్యకర్తలను ప్రజలను సమాయత్తం చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 14 తేదీ నుంచి మే 14 వరకు ఇంటింటికి సీపీఐ అను నినాదంతో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశాన్ని మండల పార్టీ నాయకులు కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ మామిడి విజయ్, మంచిర్యాల పట్టణ సహాయ కార్యదర్శి చాడ మహేందర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు వియ్యాల రాజేష్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు కేసీఆర్ కానుక



నవతెలంగాణ-దహెగాం

కల్యాణలక్ష్మి, షాదీముభారక్ పథకాలు తెలంగాణ ఆడపడుచులకు కేసీఆర్ కానుకలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 46 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఆడపడుచుల కోసం పథకాన్ని ప్రవేశపెట్టి చెక్కులు అందించడం జరుగుతుందన్నారు. మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి తిరిగి పెళ్లి అయ్యే వరకు అనేక రకాల పథకాలను అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో రైతులను అన్నివిధాలా ఆదుకుంటున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో పేద ప్రజల కోసం మరిన్ని పథకాలు ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సిద్ధిక్, జడ్పీటీసీ శ్రీరామారావు, ఎంపీపీ కంబగోని సులోచన, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బండ కృష్ణమూర్తి, ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య పాల్గొన్నారు.

పోషణ పక్వాడపై వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-జన్నారం

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ పక్వావాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వేరువేరుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తిమ్మాపూర్ అంగన్వాడీ టీచర్ జాడి సంజీవరాణి మాట్లాడుతూ, చిన్నారులు గర్భిణీ బాలింతలు మంచి పౌష్టికమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామ ప్రజలకు, పోషణలో చిరుధాన్యాల ఆవశ్యకతను తెలిపే ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో ధర్మారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోంగూరి గోపాల్, తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఎనోళి గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు ఎస్సై సాగర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి పేకాట ముక్కలు, రూ.1100 నగదును స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదుచేసినట్టు ఎస్సై పేఒర్కన్నారు. ఎవరైన పేకాట ఆడిన, ఆన్‌లైన్‌లో జూదం ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైన పేకాట ఆడితే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

పంచాయతీలకు అవార్డుల అందజేత



నవతెలంగాణ-వేమనపల్లి

జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో భాగంగా ఎంపికైన గ్రామ పంచాయతీలకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీపీ కోళి స్వర్ణలత చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులను సర్పంచులకు అందజేశారు. మొత్తం 9 శాఖల్లో అవార్డులు ఉండగా, ఈ అవార్డులను మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని గ్రామపంచాయతీలు ఎంపికయ్యాయని ఎంపీడీఓ లక్ష్మయ్య తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల సర్పంచులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీఓ బాపు రావు, ఏపీఓ సత్యప్రసాద్, సహకార సంఘం చైర్మన్ గూడ కిషన్ రావు, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, ఏపీఎం ఉమారాణి పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉత్తమ పంచాయతీ అవార్డులకు ఎంపికైన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు ఎంపీపీ ముండే విమలాబాయి అవార్డులను అందజేశారు. మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలు ఉండగా 18 ఎంపికయ్యాయని తెలిపారు. ఈ అవార్డులు డాబా, ఇందానీ, పిప్పర్‌గొంది, చొప్పన్‌గూడ, లేండిగూడ, తమేళ, వెల్గీ, నవెగూడ, వాంకిడి, బంబారా, గోయగావ్, బెండారా, సవాతి, సోనాపూర్, తెగాపూర్, సరండి, జైత్‌పూర్ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ శివకుమార్ పాల్గొన్నారు.

దహెగాం : ఉత్తమ గ్రామ పంచాయతీ అర్డుల్లో భాగంగా ఆయా సర్పంచ్‌లకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ పథకానికి ఎంపికైన గ్రామ పంచాయతీల్లో మొదటి అవార్డు బండ కృష్ణమూర్తి(బీబ్రా), రెండో బహుమతి కోంద్ర అనూష(లగ్గాం), మూడో బహుమతి తరణం సుల్తానా(కొత్మీర్) ఘనంగా సన్మానించారు. అనంతరం అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను సైతం సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిద్ధిక్, ఎంపీపీ కంబగోని సులోచన, జడ్పీటీసీ శ్రీరామారావు, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, కోఆప్షన్ సభ్యుడు హైమద్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, నాయకులు గజ్జెల సురేష్, పుప్పాల సంతోష్, దందెర వెంకన్న పాల్గొన్నారు.

చింతలమానెపల్లి : మండలంలోని చింతలమానెపల్లి, రవీంద్రనగర్-1, లంబడి హెట్టీ గ్రామ గ్రామపంచాయతీలు ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆయా గ్రామ సర్పంచ్, కార్యదర్శులను, మండల అధికారులను ఎంపీపీ డుబ్బులు నానయ్య, జడ్పిటిసి డుబ్బుల శ్రీదేవి ప్రభుత్వ ప్రశంసల పత్రంతో పాటు, శాలువలతో మిఠాయిలు పంచి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మనోజీత్ మండల్, ఎంపీడీఓ మహేందర్, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాసిపేట : జాతీయ పంచాయతీ అవార్డులలో భాగంగా తొమ్మిది అంశాలలో మండల స్థాయిలో అవార్డులను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా సర్పంచ్‌లకు అందజేశారు. ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, స్పెషల్ ఆఫీసర్ నీలిమా, ఎంపీడీఓ ఎంఏ అలీం చేతుల మీదుగా అవార్డు గ్రహీతలు సర్పంచ్, కార్యదర్శులకు అందించారు. ప్రశంస పత్రాలతో పాటు మెమెంటో అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, సర్పంచులు బాదు, తిరుమల, సపాట్ శంకర్, దేవి, రామటెంకి శ్రీనివాస్, ఆడే జంగు, భూక్య సునీత, వేముల కృష్ణ, స్వరూప, అజ్మీర తిరుపతి, సుశీల, విజయ లక్ష్మీ, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, ఎంపీటీసీలు అక్కేపల్లి లక్ష్మీ, రాంచందర్, చంద్రమౌళి, కోప్షన్ సిరాజ్ ఖాన్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట్ : మండలంలోని మూడు గ్రామ పంచాయతీలు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైనట్లు ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆ గ్రామ పంచాయతీల సర్పంచ్ లను, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. మండలంలోని కొత్తూరు, గుల్లకోట, దౌడేపల్లిలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుల్లకోట సర్పంచ్ గోళ్ళ రవీందర్, కొత్తూరు సర్పంచ్ సొల్లు సురేష్, దౌడేపల్లి సర్పంచ్ శ్యామల, అదేవిధంగా గ్రామ కార్యదర్శులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అన్నం మంగ, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.



దహెగాంలో..



కాసిపేటలో..



చింతలమానేపల్లిలో..

రవాణా రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రవాణా సవరణ చట్టం ద్వారా ప్రభుత్వ రవాణా రంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జన చైతన్య యాత్ర బృంద నాయకుడు ఎస్.వీరయ్య అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీపీఐ(ఎం) చేపడుతున్న జన చైతన్య యాత్ర శుక్రవారం మండలంలోని జెండాగూడాకు చేరుకుని అక్కడ గ్రామస్తులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి అక్కడి నుండి బైక్ ర్యాలీ ద్వారా జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద శ్రేణులు యాత్ర బృందానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రవాణా సవరణ చట్టం తీసుకువచ్చిందని దీని ద్వారా నిజం పరిపాలన కాలం నుండి ఉన్న ఆర్టీసీ నిర్వీర్యం అయ్యే పరిస్థితి తలెత్తిందన్నారు. ఇదే కాకుండా దేశంలోని ప్రతి రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థ ఈ చట్టం ద్వారా నిర్వీర్యం అవుతుందన్నారు. ఇటువంటి చట్టాలు బీజేపీ ఆర్ఎస్ఎస్ ఎన్నో తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఆదివాసులకు అన్ని హక్కులను కల్పించే జీఓ నెంబర్ 3 రద్దు చేసే విధంగా సుప్రీంకోర్టులో ఆర్ఎస్ఎస్‌కు సంబంధం ఉన్న స్వచ్ఛంద సంస్థ పిల్ దాఖలు చేసిందన్నారు. ఆదివాసీల మనోభావాలు వారికే తెలుస్తాయని అక్కడ చదువు చెప్పే ఉపాధ్యాయులు కూడా ఆదివాసీలైతే అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ జీఓ తీసుకువచ్చినప్పటికీ నేడు దానిని పూర్తిగా తుంగలో తొక్కారన్నారు. అడవులకు సంబంధించి తీసుకువచ్చిన చట్టం ద్వారా 2016 ఫిబ్రవరి నాటికి హక్కు పత్రాలు రాని భూములు లాక్కొనే విధంగా నిబంధనలు రూపొందించారని గుర్తు చేశారు. అమాయకులైన ఆదివాసీలను చైతన్యపరిచే ఉద్దేశంతో యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో అడవులను కార్పొరేటీకరణ చేస్తూ మైనింగ్ ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నామని చెబుతూ ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రయత్నాలు సాగుతున్నాయ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అంబానీ అదానిల పాదసేవలో తరిస్తుందన్నారు. దీని నుండి ప్రజల దృష్టి మరల్చడానికి మతోన్మాదం పేరుతో యువతను రెచ్చగొడుతుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న పేపర్ లీకేజ్‌కు సంబంధించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కాగజ్‌నగర్‌లో నిర్వహించే బహిరంగ సభకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు యాత్ర బృంద నాయకులు జయలక్ష్మి, అడివయ్య స్కైలాబ్ బాబు, జగదీష్, ఆశయ్య ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి బండారి రవికుమార్, జిల్లా కార్యదర్శి రాజన్న జిల్లా కమిటీ సభ్యులు దుర్గం దినకర్, అల్లూరి లోకేష్, కార్తీక్, రాజేందర్, భీమేష్ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పాటుపడుతోందని చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన 369 మంది లబ్ధిదారులకు రూ. 3.70 కోట్ల విలువగల కళ్యాణలక్ష్మి, షాదీముభారఖ్ చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.26.45 లక్షల విలువగల చెక్కులను 57 మందికి అందజేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ నిరు పేద కుటుంబాల వారికి అండగా నిలువాలన్న తలంపుతో సీఎం కేసీఆర్ మదిలో పురుడు పోసుకున్న అపురూప పథకం కళ్యాణలక్ష్మి, షాదీ ముభారఖ్‌అని చెప్పుకొచ్చారు. గడిచిన 8 ఎండ్లలో 10 లక్షల మంది పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలన్న గొప్ప లక్ష్యంతో సమ్మక్క-సారలమ్మ మహిళా భవనాలు నిర్మిస్తున్నామని, నియోజకవర్గం పరిధిలో 102 గ్రామ పంచాయతీలలో రూ.18 లక్షల చొప్పున మహిళా భవనాలు నిర్మించనున్నామని తెలిపారు. తొలి విడతగా 77 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలుపుతూ నియోజకవర్గ కేంద్రంలో రూ.1.5 కోట్లు, రామకృష్ణాపూర్, మందమర్రిలలో రూ.2 కోట్లు మహిళా భవనాలకు కెటాయించినట్లు తెలిపారు. మాతా శిశుసంరక్షణకు పెద్ద పీట వేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 14 లక్షల మందికి రూ.243 కోట్లు విలువ చేసే కేసీఆర్ కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు అధికమయ్యాయని గతంలో 30 శాతం ఉండగా ఇప్పుడు 66 శాతం ప్రసవాలు జరుగుతున్నాని వెల్లడించారు. మగ బిడ్డ పుడితే రూ.12 వేలు, ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు ఇస్తున్న ఏకైన ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమే అని తెలిపారు. ఇప్పటి వరకు 672 ప్రసూతి కేంద్రాలను అభివృద్ధి చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం భగత్ సింగ్ 92వ వర్ధంతిని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు ఎస్కే అబ్దుల్లా మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల బలిదానం నేటి యువతరానికి స్ఫూర్తి దాయకమని అన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, మతోన్మాద శక్తుల దాడుల నుండి కాపాడుకొనుటకు, సమైక్య ఆధునిక భారతాన్ని నిర్మించుకొనడానికి, మనమంతా కలిసి కట్టుగా కదలాలని అన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ నాయకులు గడ్డం విజయ్, బత్తుల ప్రకాష్ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి

- జిల్లా వైద్యాధికారి రామకృష్ణ
- ఘనంగా ప్రపంచ క్షయ దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వైద్య సిబ్బంది క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా జిల్లా వైద్యాధికారి రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీరి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో చూస్తున్న అవుట్ పేషెంట్లలో ప్రతి రోజు 10 శాతం మందికి టిబి పరీక్షలు చేయాలని సూచించారు. ఈ పరీక్షలు చేసిన వారికి హెచ్ఐవి ఎయిడ్స్, షుగర్ పరీక్ష నిర్వహించాలన్నారు. టిబి రోగులకు సంబంధించి ఏర్పాటు చేసిన రిజిస్టర్ తప్పనిసరిగా నింపాలని అన్నారు. టీబీ నిర్వహణలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి టీబీ కేసును తప్పనిసరిగా రిజిస్టర్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎక్స్-రే ద్వారా గాని ఇతర పరీక్షల ద్వారా గాని నిర్ధారణ ఆయన టిబి కేసులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. టిబి వ్యాధికి సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని క్షయ వ్యాధి నివారణ కేంద్రాలుగా ఉన్నతీకరణ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మందులు అందుబాటులో ఉన్నాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపోయినంత స్టాక్ ఉంచుకోవాలని సూచించారు. టిబి రోగులకు సంబంధించిన ట్రీట్మెంట్ కార్డులను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారి సుధాకర్ నాయక్, వైద్యులు సత్యనారాయణ, సిబ్బంది పవన్ పాల్గొన్నారు.

ఇష్టంలేని పెండ్లి చేస్తున్నారని ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా గ్రామ పంచాయతీలోని రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన నాయిని ఉమేష్(22) ఇష్టంలేని పెండ్లి చేస్తున్నారని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన అమ్మాయితో సంబంధం కుదుర్చుకున్నారు. ఈ విషయాన్ని మధ్యవర్తి ద్వారా అమ్మాయి బంధువులకు తెలియజేయగా తిరిగి వారు రాజీవ్‌నగర్‌కు వస్తారని సమాచారం ఉండడంతో తనకు ఈ పెండ్లి ఇష్టంలేదని ఉమేష్ తల్లిదండ్రులకు తెలిపాడు. పెండ్లి చేసినట్టయితే చనిపోతానని కుటుంబసభ్యులకు తెలిపాడు. గురువారం కూలి పనులు ముగించుకొని ఇంటికి రాగా తిరిగి శుక్రవారం ఉదయం లేచి చూసే సరికి కుమారుడు ఇంటిలో లేకపోవడంతో తండ్రి పోశన్న చేనుకు వెళ్లి చూడగా పురుగుల మందు తాగి మృతిచెంది ఉన్నాడు. వెంటనే ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశాడు. తండ్రి పోశన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ నాయకుల నిరసన



నవతెలంగాణ-జన్నారం

ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీకి రెండేండ్ల జైలు శిక్ష విధించటంపై నిరసిస్తూ శుక్రవారం మండల కేద్రంలో కాంగ్రెస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 2019 పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో మోడీపై చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి పరువు నష్టం దావా కేసు వేయడాన్ని తీవ్రంగా కండించారు. స్థానిక గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోర్లకుంట ప్రభుదాస్, సయ్యద్ ఫసీఉల్లా మాట్లాడుతూ ఇలాంటి కేసులకు భయపడేది లేదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దుమాల రమేష్, రేండ్ల గూడ ఎంపీటీసీ కరుణాకర్ మండల ప్రచార కార్యదర్శి ఎండీ అజార్, వార్డ్ మెంబర్ గంగన్న యాదవ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్యా, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొంతల లక్ష్మణ్, సీనియర్ నాయకులు మౌలా బకాష్, వాసాల రాజేశం, అక్క వత్తుల దేవయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇమ్రాన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఎంబి రికార్డు మాయం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న గాండ్ల రాజన్న, కర్జెల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు మన ఊరు-మన బడిలో భాగంగా పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. దీనికి సంబంధించిన రూ.6.93 లక్షల ఎంబి రికార్డులను ఈ నెల 17 శుక్రవారం రోజున ఐటీడీఏ ఉట్నూర్ కార్యాలయానికి తీసుకు వెల్లాల్సి ఉంది. జూనియర్ అసిస్టెంట్ గాండ్ల రాజన్న కార్యాలయం నుంచి వెళ్తున్న క్రమంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మంద్య సేవించాడు. ఉదయాన్నే తప్ప తాగిన మైకంలో ఎక్కడ పడిపోయాయో, ఏమయ్యాయో అని సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆయనను జడ్పీ కార్యాలయానికి గత సోమవారం సరెండర్ చేస్తూ ఎంపీడీఓ మహేందర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలోని మహిళ ఎంపవర్మెంట్ జిల్లా హబ్ నందు ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగ నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25 నుండి ఏప్రిల్ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు అర్హులైన మహిళ, పురుష అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ (మహిళలు) పోస్టుకుగాను ఆర్థిక, బ్యాంక్, తత్సమాన రంగాలలో డిగ్రీ, పీజీ చదివిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, కనీసం మూడు సంవత్సరాలు ప్రభుత్వ, ప్రభుత్వ ఇతర సంస్థలలో అనుభవం కలిగి ఉండాలని, మల్టీ టాస్క్ సర్వెంట్ (పురుషులు) పోస్టుకుగాను 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
1ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 25 మార్చి 2023

తహసీల్దార్‌గా రియాజ్‌అలీ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ - సిర్పూర్(టి)



నూతన తహసీల్దార్‌గా రియాజ్‌అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్ పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తే ఈయనను మండల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న జమీర్ హుస్సేన్ కెరమెరి మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు భూ సంబంధిత సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, మధ్యవర్తులను నమ్మి మోసపోవొద్దని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో పోషణ పక్షోత్సవాల సందర్భంగా పెంచికల్‌పేట్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హసీనా ఆధ్వర్యంలో విద్యార్థులకు చిరుధాన్యాలపై, పౌష్టికాహారంపై వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు చంద్రకళ, రాజమణి, కస్తూర్బాగాంధీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల పక్షం



నవతెలంగాణ - సిర్పూర్(టి)

బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులు 89 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి పేదింటి తల్లిదండ్రులకు ఆడపిల్ల వివాహ సమయంలో ఎంతోకొంత ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో షాదీముభారక్, కళ్యాణలక్ష్మి పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్ హుస్సేన్, ఎంపీపీ సువర్ణ, వైస్ ఎంపీపీ ఈర్త సత్యనారాయణ, ఎంపీటీసీ సోయల్ హైమద్, కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప 139 కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, జడ్పిటిసి డుబ్బుల శ్రీదేవి, తహసీల్దార్, ఎంపీడీఓ రేణిగుంట మహేందర్, వైస్ ఎంపీపీ మనోజిత్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బింకరి నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు డుబ్బుల వెంకన్న, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మోడల్ వెదురు సాగును పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ -ముధోల్

మండలంలోని ముద్గల్ శివారులో గల ప్రభుత్వ ఉద్యానవన శాఖ నర్సరీలో సాగు చేస్తున్న మోడల్ వెదురును శుక్రవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. ఈ నర్సరీలో 20 ఎకరాలలో సాగుచేస్తున్న మోడల్ వెదురు క్షేత్రాన్ని తిరిగి పరిశీలించారు. పలు వివరాలను ఉద్యనవనాధికారి హర్షవర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. ట్రిటెడ్ బాంబు సాగుకు సంబంధిత ప్రాజెక్టు రిపోర్ట్‌ను తయారు చేసి పంపాలని సంబంధిత ఉద్యాన వనాధికారికి సూచించారు. ఈ నర్సరీలో సాగు చేస్తున్న వెదురు రకాలతో పాటు పలు వివరాలను అడిగి తెలుకుసున్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ తుకారాం, ఆర్ఐ అభిమాన్యు ఉన్నారు.

ఎస్ఎంపీ అమలు తీరుపై అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిపై సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలు తీరుపై గురువారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఏరియా జీఎం బి. సంజీవరెడ్డి, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) జాన్ ఆనంద్, ఎస్ఏఎం ఎస్ఎంటీసీ విజయ్‌కుమార్, ఇన్చార్జి ఏజెంట్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, గని ఎస్ఓఎం ఇ.స్వామిరాజు, ఇన్చార్జి ఏఎస్ఓ వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగులందరూ తప్పకుండా ఎస్ఎంపీ, ఎస్ఏపీ ప్రకారం విధులు నిర్వహించాలని జీఎం బి.సంజీవరెడ్డి సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించినప్పుడే సంస్థ ప్రగతి పథంలో వెళ్తుందన్నారు. పని స్థలాల్లో తప్పకుండా రక్షణ సూత్రాలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టె రమేష్, టీబీజీకేఎస్ ప్రతినిధి బుస్స రమేష్, పిట్ ఇంజినీర్ రాజగోపాలచారి, ఇంజినీర్ కృష్ణ, వెంటిలేషన్ అధికారి డి. శంకర్, సీనియర్ పీఓ పాల్‌స్నుజన్, జేఓ స్టాన్లీ జోన్స్, అండర్ మేనేజర్లు మిట్టపల్లి శ్రీనివాస్, పరమేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సఖీ కేంద్రం సేవలపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు, విద్యార్థినులు సఖి కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం సిబ్బంది లావణ్య, సంఘమిత్ర అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, బ్యూటిషన్ కోర్స్ శిక్షణ తీసుకుంటున్న మహిళలకు సఖి సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయంతో పాటు తాత్కాలిక వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 181, 1098, 100కు ఫోన్ చేయాలని సూచించారు. సఖి కేంద్రంలో చెప్పిన విషయాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ముధోల్ వారసంత వేలం పాట

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ వారసంత వేలంపాటను శుక్రవారం గ్రామపంచాయతీ సర్పంచ్ రాజేందర్ అధ్యక్షతన నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి వేలం పాటలో ఆరుగురు వ్యాపారులు పాల్గొనగా, యండి లాయక్ రూ.లక్షాతొమ్మిది వేలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, సిబ్బంది అనూష, ఉపసర్పంచ్ సంజీవ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వసూళ్ల రాజ్యంగా మోడీ పాలన

- పన్నుల భారం చిరువ్యాపారులకు శరాఘాతం
- కేంద్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకు కోత
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య
- కాగజ్‌నగర్ చేరుకున్న జన చైతన్య యాత్ర

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కాగజ్‌నగర్

కేంద్రంలోని మోడీ పాలన వసూళ్ల రాజ్యంగా మారిందని సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య విమర్శించారు. జీఎస్‌టీ పేరుతో అన్ని రకాల వస్తువులపై పన్నుల భారం మోపడం చిరువ్యాపారులకు శరాఘాతంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీపీఐ(ఎం) చేపట్టిన జన చైతన్య యాత్ర శుక్రవారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ముందుగా స్థానిక లారీ చౌరస్తాలో కార్యకర్తలు, నాయకులు,ప్రజలు యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. బృందం నాయకులు ఎస్.వీరయ్య ద్విచక్రవాహనంపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఎస్.వీరయ్య మాట్లాడారు. మంచిర్యాల-చంద్రాపూర్ హైవే నిర్మాణం పూర్తికాకముందే ఇప్పటికే టోల్‌గేట్ల పేరుతో కేంద్రప్రభుత్వం వసూళ్లు చేపడుతోందని వివరించారు. వ్యవసాయం,ఉపాధిహామీ, మహిళా శిశుసంక్షేమం, దళితులు, గిరిజన రంగాలకు బడ్జెట్‌లో కోత విధించిందని గుర్తుచేశారు. వ్యవసాయంలో రాయితీలను తొలగించారని కేవలం డ్రోన్లతో సాగు చేసే వారికి మాత్రమే రాయితీలు వర్తించేలా కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇది కేవలం భూస్వాములకే ప్రయోజనం కల్పిస్తుందని పేద రైతులకు ఏమాత్రం ఉపయోగపడదని పేర్కొన్నారు. వందేభారత్ రైలు గురించి గొప్పగా చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం అదే సమయంలో 500ప్యాసింజర్ రైళ్ల రద్దు చేసిందని, 10వేల స్టేషన్లను ఎత్తివేసిందని వ్యాఖ్యానించారు. సీనియర్ సిటిజన్లకు రాయితీలు ఎత్తివేసిందని రైల్వేలో ఖాళీగా ఉన్న 8లక్షల ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జీ బండారు రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో చాలా చోట్ల పత్తిపంట ఇప్పటికీ ఇండ్లలోనే నిల్వ ఉందని ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ కొనుగోళ్లలో పూర్తిగా చేతులెత్తేసిందని విమర్శించారు.



బీజేపీ,ఆర్ఎస్ఎస్‌లు మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నాయని తెలిపారు. సర్కారుబడుల్లో పేదపిల్లలు తినే మధ్యాహ్న భోజనంలోనూ రూ.10వేల కోట్లు బడ్జెట్‌లో కోత విధించిందని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం చేస్తున్న పాపాలను ప్రజలకు వివరిస్తూ వారిలో చైతన్యం నింపేందుకే ఈయాత్ర చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు తిరుగుతూ ఈ నెల 29న హైదరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. అక్కడ భారీ బహిరంగ సభ ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మీ, స్కైలాబ్‌బాబు, జగదీష్, వెంకటేశ్వర్లు, ఆశయ్య, ఆశాలత, ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు ఎస్.సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, అల్లూరి లోకేష్, ముంజం ఆనంద్‌కుమార్, జాదవ్ రాజేందర్, అంబాల ఓదేలు, ముంజం శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, నాయకులు చిరంజీవి పాల్గొన్నారు.



పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్

బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, ఎమ్మెల్సీ పురాణం సతీష్‌తో కలిసి శుక్రవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. భారత రాష్ట్ర సమితికి పార్టీ కార్యకర్తలే బలమన్నారు. జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమన్వయంతో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని తెలిపారు. ప్రాథమిక కార్యాచరణగా ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ, 25న నియోజవర్గం పార్టీ ప్రతినిదుల సభ, 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 30న సచివాలయ ప్రారంభోత్సవం, మే 1న కార్మిక దినోత్సవం, మే మొదటి వారంలో విద్యార్థి యువజన సమ్మేళనాలు, మే నెలలో షోషల్ మీడియా వారియర్లతో సమావేశాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మే మూడవ వారంలో కొత్త విద్యార్థి కమిటీల ఏర్పాటు, జూన్ 1న తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ, జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, జూన్ రెండవ వారం నుండి విద్యార్థి విభాగం సభ్యత్వ నమోదు, నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమాలు, సెప్టెంబర్ 17న జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని జరుపుకోవాలని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ దిశగా జయంతి



ఉత్సవాల కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు. దేశంలో అతి పెద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, పరిపాలన ఆత్మగౌరవ చిహ్నంగా నూతన సచివాలయానికి సైతం బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టినట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గం పరిధి ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు అందించడంలో ముందున్నాం'

నవతెలంగాణ - బెజ్జూర్

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ముందుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఇంటికి ఒక సంక్షేమ పథకం అందించామన్నారు. కళ్యాణలక్ష్మి పథకం కింద నియోజకవర్గంలో ఇప్పటికి 11వేల మందికి చెక్కులను అందజేశామన్నారు. వంద కోట్లకుపైగా లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలో 34900 మందికి ప్రతి నెల రూ. 2 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. రైతుబంధు పథకం కింద ఇప్పటికి రూ.649 కోట్లను రైతుల ఖాతాల్లో వేశామన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం మరొకటిలేదన్నారు. మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టే పార్టీలను నమ్మకూడదన్నారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలో కేవలం రూ.600 పెన్షన్ ఇస్తుంటే తెలంగాణలో రూ.2వేల పెన్షన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. బెజ్జూర్‌లో నాలుగు రోడ్లను త్వరగా పూర్తి చేస్తామన్నారు. బెజ్జూర్ నుండి సిద్ధాపూర్‌కు బీటీ రోడ్డుకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలో బీటీ రోడ్డు మంజూరవుతుందన్నారు. మండలంలోని నలుమూలల రోడ్డు సౌకర్యాలు కల్పించామని, అభివృద్ధి చేసే నాయకుడిని ఆశీర్వదించాలని కోరారు.



కార్యక్రమంలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కోండ్ర జగ్గాగౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ ఓంప్రకాష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సకారాం, నాయకులు డోకె వెంకన్న, జావీద్ అలీ, జావీద్ హుస్సేన్,సామెల రాజన్న, రాజారాం, హనుమంతు, రెహమాన్, పొరిశెట్టి రవి పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం : ఎస్పీ సురేష్‌కుమార్

నవతెలంగాణ - సిర్పూర్(టి)

విద్యార్థులు ఒత్తిడిని జయించాలంటే కృషి, తపన, పట్టుదల, సమయపాలన ముఖ్యమని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ



సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమయపాలన విజయానికి ముఖ్య సూత్రాలవుతాయని, తాను మారుమూల గ్రామంలో పుట్టి కనీసం బస్సు సౌకర్యం లేని ఊరు నుండి మూడు కిలోమీటర్లు నడిచివెళ్లి చదివానని తెలిపారు. పట్టుదలతో దేశంలో అత్యున్నతమైన ఐపీఎస్ స్థాయికి ఎదిగానని, దీనంతటికి చదివే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తాను అనుకున్న లక్ష్య సాధనకు ఆలోచించాలన్నారు. లక్ష్యాన్ని సాధించడానికి ఒత్తిడిని అధిగమించి ముదుకెళ్లాలని సూచించారు. చదవడంలో మూడు రకాలుగా ఉంటాయని, అందులో ఆనందం కోసం, విజ్ఞానం కోసం, పరీక్షల కోసం చదవడం ఉంటుందన్నారు. తనమీద తనకు నమ్మకం ఉన్నప్పుడే అనుకున్నది సాధించ గలుగుతామని ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులు ఉపన్యాసం చేయగా ఎస్పీ అభినందించారు. మండలంలోని 10 పాఠశాలలకు సంబంధించిన సుమారు 700 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, ఇన్‌చార్జి ఎంఈఓ సోమయ్య, కౌటాల సీఐ సాదిక్‌పాషా, డీసీఓ బాలరాజు, ఎస్ఐ దీకొండ రమేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ - బెజ్జూర్

ఇటీవల నిర్వహించిన అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నమెంటు శనివారం ముగియడంతో విజేతలుగా నిలిచిన బల్లార్షా టీంకు, రన్నర్‌గా నిలిచిన మంచిర్యాల టీంకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బహుమతులను అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో భారీ ఎత్తున టోర్నమెంటు నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. విన్నర్‌గా నిలిచిన టీంకు రూ.50 వేలు, రన్నర్‌గా నిలిచిన టీంకు రూ.30 వేల నగదును అందజేశారు.



జన చైతన్య యాత్ర బృందానికి బీఆర్ఎస్ నాయకుల సన్మానం



నవతెలంగాణ - జైనూర్

సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర బృందం సభ్యులను శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన నిరంతరం సీపీఐ(ఎం) పోరాడుతుందన్నారు. ముందుగా జిల్లా సరిహద్దులో సీపీఐ(ఎం) నాయకులు బైక్ ర్యాలీతో బృందానికి ఘన స్వాగతం పలికారు. బృంద సారధి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య, యాత్ర నాయకులు, రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, ఆశయ్య, జగదీష్, స్కైలాబ్, అడివయ్య, బాలకృష్ణ ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్, నేతకాని సంఘం రాష్ట్ర కన్వీనర్ జాడి రవీందర్, ఎంపీటీసీ కుమ్ర భగవంత్‌రావు, ఆత్రం జుగాదిరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గెడం లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు పెందూర్ మోహన్, సీపీఐ(ఎం) నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్, సప్లిమెంటరీ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

పెండింగ్, సప్లిమెంటరీ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు అన్నారు. శుక్రవారం డిటిఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మొదటి తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల సప్లిమెంటరీ వేతనాలు, బకాయిలు, జీఎల్ఎస్ఐలు నెలలు గడుస్తున్నా సంబంధిత ఖాతాల్లో నిధులు జమ కాలేదని అన్నారు. ఉపాధ్యాయులు పెండింగులో ఉన్న ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షనరీ టిఎస్ జీఎల్ఎస్ఐ, పెండింగ్ బిల్లులన్నింటినీ మార్చి చివరిలోగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు దాసరి శంకర్, విజయ్ కుమార్, పెంట అశోక్, జాదవ్ వెంకట్, చంద్రకాంత్, రమేష్, మహేంద్ర చారి, అబ్దుల్, చొక్కారావు, మధుసూదన్, రఘు పాల్గొన్నారు.

టిష్యూ ప్రాసెసింగ్ మిషన్ బాగు చేయించాలని వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో నాలుగు సంవత్సరాల నుండి పని చేయకుండా ఉన్న టిష్యూ ప్రాసెసింగ్ మిషన్‌ను బాగు చేయించాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ సామ రూపేష్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై శుక్రవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి మిషన్ బాగు చేయించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ గర్భసంచి ఆపరేషన్‌లు నిలిచిపోయాయని, అనేక మంది పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకెళ్లి గర్భసంచి ఆపరేషన్‌లు చేసుకోవాలంటే రూ.40 నుండి రూ.50వేలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసుల జిల్లా అని, కూలీనాలి చేసుకొని పూట గడవని పరిస్థితి ఉందన్నారు. అలాంటి వాళ్ల ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి గర్భసంచి ఆపరేషన్ చేసుకునే పరిస్థితి లేదన్నారు. డైరెక్టర్ సానుకూలంగా స్పందించి తొందరగా ప్రజలకు అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూప్‌రావు, విజయ్ పటేల్, జైనథ్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు పిడుగు స్వామి, సంతోష్ ఉన్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL DISTRICT JUDGE (MACT) AT KARIMNAGAR
M VO.P. No 162 of 2020

Between:-
Jangarla Madhunaiah ... Petitioner.
AND
Rayi Ramanna and others ... Respondents.

To
R1 Rayi Ramanna, S/o.Late Guruvalu, Aged: 53 years, Occ: RTC Driver, R/o. H.No.9-5-110, Shameem Nagar, Bellampalli, Dist:Mancherial Cell No.9492190287.

Please take notice, where as the above named Petitioner filed a petition for compensation for injuries caused in motor vehicle accident against you and others. Further the Petitioner sent several notices through court and register post, but it is report that you are not available. Hence the Hon'ble Court issued notice to you through paper publication. Therefore the above case is **posted on 29-3-2023 at 10-30 a.m.** for your appearance, before this Hon'ble Court. Hence you may present on the above said date, by in person or along with your counsel and admit the claim of the petitioner or oppose the same. In case of default the petition will be heard and determined in your absence.

"By the order of the court"
Sd/-
J. SATYANARAYANA RAO
Advocate
H.No.3-7-882,
Vavilalapally, Karimnagar.

మంత్రి హరీశ్‌రావుని కలిసిన పిప్పల్‌కోటి రైతులు

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు శుక్రవారం భోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి హైదరాబాద్‌లో మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి తన్నీరు హరీశ్‌రావును పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూనిర్వాసితులు కలిసి తమ సమస్యను వివరించారు. రూ. 15 కోట్ల 96 లక్షల నిధులు విడుదల చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో రిజర్వాయర్లలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. వీరి వెంట పిప్పల్‌కోటి సర్పంచ్ గంగయ్య, నాయకులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, వినోద్ యాదవ్, అశోక్, రమణరెడ్డి, రామ్‌రెడ్డి, నందయ్య ఉద్ధవ్, హైమద్, మల్లేష్ ఉన్నారు.

జిల్లా స్థాయిలో ఉత్తమ గిరి పంచాయతీలు

నవతెలంగాణ-నార్నూర్



జిల్లా స్థాయిలో గిరిజన పంచాయతీలు ఉత్తమ అవార్డులను సొంతం చేసుకున్నాయి. మండలంలోని గిరి గ్రామాలు గుంజాల, గంగాపూర్, మలెంగి, మహాగావ్ నాలుగు గిరిజన గ్రామ పంచాయతీలు జిల్లా స్థాయిలో వివిధ ఆరు విభాగాల్లో ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉత్తమ గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీపీఓ శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఎంపీఓ స్వప్న శీలా, సర్పంచ్‌లు కుమ్ర సావిత్రిబాయి, యూర్వేత రూపదేవ్, పూసం రూప, రాథోడ్ యశ్వంత్ రావ్, కార్యదర్శులు శ్రీనివాస్, రమేష్, స్నేహ, శంకర్ ఉన్నారు.

స్వల్ప అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. తిర్పెల్లి కాలనీలోని గ్యాస్ గోడౌన్ వెనకాల గల ఖాళీ స్థలంలో పోగు చేసిన చెత్త కుప్పకు అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను ఆర్పి వేశారు. అగ్ని ప్రమాదం జరిగిన కొద్ది దూరంలో స్క్రాప్ దుకాణంతో పాటు గ్యాస్ గోదాములు ఉన్నాయి. దీంతో పెను ప్రమాదం తప్పింది.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ స్థానిక ప్రయివేటు ఆస్పత్రిలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళను లొంగదీసుకున్నాడు. పెండ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి అబార్షన్ చేయించాడు. ఇదంతా చేసిన కానిస్టేబుల్ ఆమెను నిర్లక్ష్యంగా వదిలేయడంతో సదరు మహిళ మనస్థాపం చెంది ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



నవతెలంగాణ-గుడిహత్నూర్

కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న వీఓఏలు ఐకేపీ ఎపీఎం భగవాండ్లుకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మనోహర్, రంగు చంద్రకళ మాట్లాడుతూ నేటి నుంచి వచ్చే నెల 2 వరకు తమ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అన్‌లైన్ సేవలతో పాటు ఎటువంటి సేవలు అందించడం లేదని అన్నారు. అర్హులైన విఓఏలను సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, 10 లక్షల ఆరోగ్య బీమా కల్పించి, సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జాడి రవిందర్, రాజేష్, వెంకటేష్, తోడసం ధనలక్ష్మి ఉన్నారు.

యువకులు దైవభక్తి కలిగి ఉండాలి



నవతెలంగాణ-గుడిహత్నూర్

యువకులు దైవభక్తి కలిగి ఉండాలని బంజారాల ఆధ్యాత్మిక దీక్షా గురూ ప్రేమ్ సింగ్ మహరాజ్ అన్నారు. సేవాలాల్ దీక్షాపరులు నార్నూర్ మండలంలోని కోత్తపల్లి దీక్షభూమి నుంచి పొరాదేవికి (మహరాష్ట్ర) వరకు చేపట్టిన మహ పాదయాత్ర శుక్రవారం తోషం చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో మహరాజ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆధ్యాత్మికతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతీ ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని అన్నారు. భక్తి భావనతో నడుచుకోవాలని, భక్తితో ఉంటే మంచి పనులు చేయాలనే ఆలోచనలు వస్తాయని తెలిపారు. నిత్యం భగవంతుడిని స్మరించడంతో ప్రతి ఒక్కరి జీవనం సుఖసంతోషాలతో వర్ధిలుతుందన్నారు. భగవంతుడి ముందు అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ బంజారా ధర్మాన్ని కాపాడాలని అన్నారు. 3వేల మంది సేవాలాల్ భక్తులకు ఏఐసీసీ సభ్యుడు డా.నరేష్ జాదవ్ అధ్వర్యంలో బంజారా సాంస్కృతి సాంప్రదాయాల ప్రకారం మహ అన్నదానం, భోగ్ భండార్ నిర్వహించారు. వివిధ మండలాల నుంచి బంజారాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లాల్‌టెక్డిలో ఉన్న గిరిజన పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోనీ డీడీ దిలిప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థులకు సక్రమంగా భోజనం పెట్టడం లేదని, తాగేందుకు తాగునీరు ఉండటం లేదని అన్నారు. చదువుకునేందుకు సరియైన పుస్తకాలు అందుబాటులో లేక విద్యార్థులు అందోళన చెందుతున్నారని అన్నారు. గిరిజన విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉన్నత అధికారులు సైతం చొరవ తీసుకోవాలని అన్నారు. కళాశాలల్లో, వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు తన్నీరు సతీష్, నాయకులు ముజిబ్, సుశీల్ ఉన్నారు.

ప్రసూతి మరణాలు జరగకుండా చూడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రసూతి మరణాలు జరుగకుండా తక్షణ వైద్య సేవలు అందించి పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. గురువారం రోజున సాయంత్రం నుండి రాత్రి వరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్‌లతో ప్రసూతి మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సర కాలం నుండి 10 ప్రసూతి మరణాలు జరిగాయని అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయని, అవగాహన లోపం, కట్టుబాట్ల వలన మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రతీకేసుకు సంబంధించిన వివరాలు ఆయా మెడికల్ అధికారులు డిస్కస్ చేయాలని అన్నారు. ప్రసవానికి ముందే బర్త్ వెయిటింగ్ రూమ్‌కు తరలించాలని అన్నారు. నిర్ధీత సమయానికి ఎన్ని పరీక్షలు నిర్వహించాలని, బీపీ హిమోగ్లోబిన్ శాతం పరిశీలించాలని అన్నారు. అనీమియా సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతీ కేసుకు సంబంధించిన తీవ్రత ఎలా ఉంది అనే వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. తద్వారా అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రసూతి కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే మహిళల ఆరోగ్య బాధ్యత మెడికల్ ఆఫీసర్‌లపై ఉందని అన్నారు. అలాగే హైరిస్క్ ఉన్న బాధ్యత కూడా వారిదే అని అన్నారు. వైద్య చికిత్సలకు సంబంధించిన వివరాలను తప్పని సరిగా నమోదు చేయాలని అన్నారు. మహిళల డెలివరీ ప్లానింగ్ ముందే చేసుకోవాలని, ఆశ, ఏఎన్‌ఎంలతో నిర్వహించే నెలసరి సమావేశంలో పూర్తిగా, ప్రతీ కేసు వారీగా చర్చించాలని అన్నారు. హిమోగ్లోబిన్ పెరిగే విధంగా తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వ ఇన్స్టిట్యూట్‌లలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏవి ఎన్ని నిర్ణీత సమయానికి పరీక్షలు నిర్వహించుకునే విధంగా మానిటరింగ్ పక్కగా జరగాలని అన్నారు. ప్రసూతి మరణాల బారిన పడకుండా ఉండేందుకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో మహిళా, శిశు సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. అందులో స్థానిక ఆశ, ఏఎన్‌ఎం, మహిళా సంఘాల సభ్యులు, మహిళా సర్పంచ్, కమ్యూనిటీ లీడర్స్‌లను కమిటీలో నియమిస్తామని తెలిపారు. ప్రసూతి, శిశు మరణాలు, ఇతర అనారోగ్య సమస్యల వలన మరణాలు జరుగకుండా ఈ కమిటీ పర్యవేక్షించడంతో పాటు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అపరిశుభ్రత, డయేరియా వంటి వాటితో మరణించడం జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం వయోవృద్ధులు, ఇతర వైద్యసేవలు అందించే ప్రచార పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ పర్యవేక్షకులు అశోక్, ప్రోగ్రాం అధికారి విజయసారథి పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- 90 కిలోల గంజాయి పట్టివేత
- సినీ ఫక్కీలో గంజాయి స్మగ్లర్ల అరెస్టు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

సులభంగా అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని ఎంచుకున్న గంజాయి స్మగ్లింగ్ దుండగులను కటకటాల పాలు చేసింది. శుక్రవారం దిలావర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన షేక్ ఆరీఫ్(27), వికారాబాద్‌కు చెందిన అన్వర్(32)లు రౌఫ్ స్నేహితులుగా ఉంటూ గతంలో కూడా గంజాయి కేసులో నిందితులుగా చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవించారు. వారి ప్రదేశాల నుండి భద్రాచలానికి వచ్చి గంజాయి అమ్ముతారని రౌఫ్ అనే వ్యక్తిని తెలుసుకొని అందుకోసం ఒక ప్రణాళిక రచించి ఏపీ 09బీబీ 0459 నెంబరు గల హోండా సిటీ కారులోని డిక్కీ భాగంలో సగం వరకు ఒక మెటల్ షీట్‌తో తయారు చేసి, దానికి సీటు కింది భాగంలో నుంచి ఒక రంధ్రాన్ని ఉంచి ఆ ప్రదేశం గుండా గంజాయిని దాచి ఉంచుటకు తయారు చేసుకున్నారు. పైనుండి చూసిన వారికి కూడా ఎలాంటి అనుమానం కలగకుండా ప్రత్యేకంగా తయారు చేసుకోని గంజాయిని తరలిస్తున్నారు. ఈ కారును ఉపయోగించి సోమవారం అత్తాపూర్ నుండి భద్రాచలం వెళ్లి అక్కడ మహమ్మద్ అబ్దుల్ కొనాన్, అమ్రిత్‌లను కలుసుకొని రూ.18 లక్షల విలువచేసే 90 కిలోల గంజాయిని కొని అట్టి ఆ గంజాయిని 26 ప్యాకెట్లలో నింపుకొని ప్రత్యేకంగా తయారు చేసుకున్న కారు డిక్కీలో దాచిపెట్టి భద్రాచలం నుండి మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలించేందుకు బయలుదేరారు. శుక్రవారం పోలీసులకు అందిన సమాచారం మేరకు దిలావర్‌పూర్ టోల్ ప్లాజా వద్ద ఎస్సై గంగాధర్ పోలీసు సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో వస్తున్న నేరస్తులలో ఒకడైన రౌఫ్ పోలీసులను చూసి భయంతో పారిపోయాడు. అంతలోనే ఎస్సై పోలీస్ సిబ్బంది మిగతా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కారుని తనిఖీ చేయగా కారు డిక్కీలో స్టెప్‌ని కింద వెల్డింగ్ చేసి ఉండి డిక్కీ బాగా తక్కువగా కనిపించడం వలన రాడ్డుతో ఆ మెటల్ షీటును తొలగించి చూడగా అందులో 26 గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఈ గంజాయిని మహారాష్ట్రలోని నాందేడ్‌లో కిలో రూ.20వేలకు అమ్మడానికి వెళ్తున్నామని నేరస్తులు ఒప్పుకున్నారు. అనంతరం ఎస్సై, దిలావర్‌పూర్ తహసీల్దార్ కరీం పంచనామా నిర్వహించారు. 26 ప్యాకెట్లలోని 90 కేజీల గంజాయితో పాటు, నేరస్తులు ఉపయోగించిన హోండా సిటీ కారు, రెండు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనపరచుకున్నారు.వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తామని తెలిపారు. వీరికి గంజాయి అమ్మిన వ్యక్తులను, కొనేందుకు సిద్ధపడిన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై చంద్రమోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొలాంగూడలో క్షయపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్వచ్ఛంద సేవా సహాయకుడు భూపెల్లి శ్రీదర్ స్వచ్ఛంధంగా మావల మండలంలోని కొలాం గూడలో క్షయవ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లెక్కల ప్రకారం మన గ్రామంలో టీబీ అంటువ్యాధి ప్రతి సంవత్సరంలో ఐదు మందికి ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ టీబీ వ్యాధి పట్ల కొలాం గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని, ఈ వ్యాధి సోకినట్లు అనిపించిన వారికి ప్రభుత్వం ఉచితంగా రిమ్స్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా ఆరునెలల మందులు ఉచితంగా అందిస్తారని అన్నారు. ప్రభుత్వం రోగికి ఆరునెలల మందులతో పాటు వారికి రూ.3వేలు అకౌంట్‌లో పౌష్టికాహారం నిమిత్తం జమచేస్తుందన్నారు. ఈ వ్యాధి ఒకరి నుండి ఒకరికి రోగి దగ్గినప్పుడు, గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని అన్నారు. ఈ వ్యాధి సోకే ముందు 15రోజుల నుండి 20 రోజుల వరకు ఎడతెరిపి లేకుండా పొడి దగ్గు ఉంటుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారు వేగంగా బరువు తగ్గడం జరుగుతుందని అన్నారు. రాత్రి వేళల్లో, మధ్యాహ్నం పూట, విపరీతమైన జ్వరం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు.ఇలాంటి లక్షణాలు ఉన్నవారు తప్పకుండా ఆశా కార్యకర్త ద్వారా రిమ్స్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకొని 6నెలల కోర్సు వాడుకోవాలని గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామంలో టీబీ అంటువ్యాధి సోకిన వారితో కొద్దిగా భౌతిక దూరం పాటించాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను దూరంగా ఉంచాలని అన్నారు. మద్యపానం, గుట్కా, తంబాకు, గంజాయి లాంటివి తాగకూడదని ఇలాంటి పలు జాగ్రత్తలు తీసుకుంటే టీబీ అంటు వ్యాధి మహమ్మరిని అడ్డుకోవచ్చని కొలం గిరిజనులను ఉద్దేశించి వరల్డ్ టీబీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటి, కొలాంగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల స్వయం సమృద్ధికి పాటుపడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్





గ్రామాల స్వయం సమృద్ధికి కలిసి కట్టుగా పనిచేసి గ్రామాభ్యుదయానికి పాటుపడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్-2021-22 కార్యక్రమం కింద జిల్లా స్థాయి ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా గ్రామస్వరాజ్యాన్ని మనం సాధించుకోవాలని అన్నారు. ఇతరులపై ఆధారపడకుండా గ్రామాలకు అవసరమైన వాటిని మనమే ఉత్పత్తి చేసుకోవాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామంలో ట్రాక్టర్లు, సేగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, క్రీడా ప్రాంగణాలు, రైతువేదికలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాలు ప్రగతి బాటలో పయనిస్తున్నాయని అన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సహకారంతో గ్రామాలు ప్రగతి బాటలో నిలిచే విధంగా ప్రణాళికలతో అభివృద్ధి చెందాలని అన్నారు. జెడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, రాజులు మాట్లాడుతూ పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రతి నెల నిధులు సమకూర్చడంతో పాటు సేవలు అందించి జాతీయ స్థాయికి ఎదగాలని అన్నారు. సర్పంచ్‌లు జాదవ్ లఖన్, పెందూర్ కళావతిలు మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టడం వలననే ఈనాడు ప్రతిఫలం దక్కిందని, గ్రామాల అభివృద్ధికి తమవంతు మరింత కృషి చేస్తామని అన్నారు. అనంతరం తొమ్మిది అంశాలలో ప్రతిభ కనబరిచిన గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను శాలువా, మెమొంటో, ప్రసంశ పత్రాలతో కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ గణపతి, డీఆర్డీఓ కిషన్, జెడ్పీటీసీలు సుధాకర్, చారులత, అరుంధతి, సర్పంచ్‌లు, డివిజనల్ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న సేవాలాల్ పాదయాత్ర



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కొత్తపల్లి దీక్షభూమి నుంచి పొరాదేవి వరకు చేపట్టిన పాదయాత్ర నేడు మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా సంత్ సేవాలాల్ ప్రేమ్‌సింగ్ మహరాజ్‌కు ఇంద్రవెల్లిలో పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు రాధకృష్ణ మందిరంలో ఇంద్రవెల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. సంత్ ప్రేమ్‌సింగ్ మహరాజ్ భోగ్‌బండార్ నిర్వహించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ ప్రేమ్‌సింగ్ మహరాజ్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ మోహన్ రాథోడ్, సామాజిక కార్యకర్త అనిల్ రాథోడ్, శేశరావ్, పీరాజి, ప్రేమ్‌సింగ్, కామాజి పాల్గొన్నారు.

శతచండీయాగంలో ఎమ్మెల్యే దంపతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

జిల్లా కేంద్రలోని దుర్గానగర్ కాలనీలోని దుర్గామాత ఆలయంలో ఉగాదిని పురస్కరించుకొని కొనసాగుతున్న శతచండీయాగం హోమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. శాంతి స్థాపనతో పాటు రైతాంగం, పాడి పరిశ్రమలు, అన్ని రంగాల వారికి విజయాలు చేకూరాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సామాజిక కార్యకర్త బండారి దేవన్న, సాంగ్వి సర్పంచ్ విఠల్‌రెడ్డి, వేద పండితులు కిషన్, నవదుర్గ మాత భక్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలి రావాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని ప్రతీ గ్రామానికి వెళ్లి కార్యకర్తలతో సమావేశమయ్యారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను తరలించాలని నాయకులకు సూచించారు. రానున్న రోజుల్లో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కేశం లక్ష్మి రమేష్, శాతం గంగారాం, గణేష్, జహీర్, ఈటెల శ్రీనివాస్, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి నిరుద్యోగులకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేపర్ లీకెజీ గురించి చేసిన వ్యాఖ్యలకు నిరుద్యోగులకు బేషరత్‌గా క్షమాపణలు చెప్పాలని, అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని నర్సాపూర్(జి) మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు అర్జున్ ఠాకూర్ సింగ్, బీజేపీ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు దేవేందర్ సీనియర్ నాయకులు బరుకుంట నరేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి, ప్యారమూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఘనంగా పోషణ పక్షోత్సవాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సర్పంచ్ ఎస్ సుచరిత, దివ్యరెడ్డి, ఐసీడీఎస్ విజయ గౌరీ హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ చిరు ధాన్యాలలో ఉండే అనేక పోషక విలువలను గురించి గర్భవతులకు, బాలింతలకు పిల్లలకు మహిళలకు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్‌లు దీపిక, మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఐకేపీ వాణి, సారిక, నవీన్, అంగన్‌వాడీ టీచర్స్ భాగ్య, అరుణ, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేద్దాం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్ పర్సన్ విజయలక్ష్మి రాంకిషన్ రెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు వెంకట్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, ఎఫ్ఎస్సిఎస్ చైర్మెన్ ధర్మాజీ రాజేందర్, మండల బీఆర్ఎస్ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీపీలు పాల్దె అక్షర అనిల్, కొండ్ర రేఖ రమేష్, వైస్ ఎంపీపీ యాదవ్ బాబురావు, ఎంపీటీసీలు అమృత చిన్నారెడ్డి, పోల జయసుధ సురేష్, సర్పంచ్‌లు ఒడ్నం సవిత కృష్ణ, ఇట్టెడి గంగారెడ్డి, ముచ్చింద్ల సరిత రాజు, ఆడెపు తిరుమల శ్రీనివాస్, కాల్వ లక్ష్మీ నరసింహ ఆలయ చైర్మెన్ చిన్నయ్య, కదిలి పాపహరేశ్వర ఆలయ చైర్మెన్ భుజంగరావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి వరం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ-కౌటాల

పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని రైతువేదికలో 45 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెండ్లికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన ఆదిలోనే రూ.50 వేలు తర్వాత రూ.75 వేలు ఆడబిడ్డల పెండ్లికి పెరుగుతున్న ఖర్చులు పెరిగినందున చాలకపోవడంతో ఆడబిడ్డల పెద్దన్నగా భావించిన సీఎం కేసీఆర్ ఏకంగా రూ.1.116 లక్షలు ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. పెండ్లి నుండి మొదలుకొని బిడ్డ ప్రసవం కోసం ఉచితంగా అంబులెన్స్‌తో ఇంటి నుండి తీసుకొచ్చి ప్రసవం అయిన తర్వాత తిరిగి ఇంటి వద్దకు దింపడం జరుగుతుందన్నారు. దీంతోపాటు గర్భిణులకు పౌష్టికాహార కిట్, ప్రసవించిన తరువాత కేసీఆర్ కిట్టు అందిస్తున్నట్టు ఆయన గుర్తు చేశారు. రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులను ఆదుకుంటున్నట్టు గుర్తు చేశారు. అనంతరం దీన్‌దయాల్ ఉపాధ్యాయ సతత్ వికాస్ పురస్కారానికి ఎంపికైన మండలంలోని మూడు గ్రామ పంచాయతీలు కౌటాల, ముత్తంపేట, గుండాయిపేట్ గ్రామాల్లోని సర్పంచ్‌లు, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, కార్మికులు, ఆశా కార్యకర్తలు, ఉపాధిహామీ తదితరులకు అవార్డులతో పాటు శాలువాలతో సన్మానించారు.



బీఆర్ఎస్‌లో పలువురి చేరికలు..

చింతలమానెపెల్లి మండలం దిందా, కేతిని గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నుండి 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం శ్రీరామనవమి ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. మండలకేంద్రంలోని కోదండ రామాలయంలో ఈ నెల 30వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవానికి సకుటుంబ సమేతంగా హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, జడ్పీటీసీ డోంగ్రి అనూష, ఇన్‌ఛార్జి తహసీల్దార్ బీంలాల్ నాయక్, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఎంపీఓ మౌనిక, ఏపీఎం వెంకటరమణ, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బ్రహ్మయ్య, సర్పంచ్‌లు మౌనీష్, శ్రీనివాస్, సునీత, ఉప సర్పంచ్ తిరుపతి, ఎంపీటీసీ మనీష్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు వసంత్‌రావు, వెంకన్న, యూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఫణీందర్‌గౌడ్, సంతోష్, బాపు, రాంచందర్, మధూకర్, నారాయణ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, సర్పంచ్‌లు కమల, శ్రీనివాస్, సంజీవ్, రాజయ్య, ఎంపీటీసీ దూగుంట రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిత్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి, నాయకులు శ్రీనివాస్, కైరాత్, సదాశివ్, బండన్న, ఎస్‌కె బాబు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం

నవతెలంగాణ-నార్నూర్

పోషకాహారంతోనే గర్భిణీ బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ ఉమా అన్నారు. శుక్రవారం ఉమ్మడి మండలంలోని జిన్‌గూడ, విజయనగర్ కాలోని, మాంజరి, పూనగూడ, నాగల్‌కొండ, డోంగర్‌గావ్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పోషణ పక్షోత్సవంలో భాగంగా పోషణ ప్రతిజ్ఞ, హ్యాండ్ వాష్ చేయించారు. అంగన్‌వాడీ టీచర్‌తో కలిసి గర్భిణీ బాలింతలకు ఇచ్చే చిరుధాన్యాలపై వివరించారు. వారికి ముఖ్యంగా చిరుధాన్యాలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రణాళిక ప్రకారం 154 కేంద్రాల్లో రోజువారీ కార్యక్రమం కొనసాగుతున్నట్లు పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు డురే వందన, నైతం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌లు ఉన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునికి పశుమిత్రల వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జన చైతన్య యాత్రలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్యకు జిల్లాలోని పసుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి ఇందు మాట్లాడుతూ పశు మిత్రులను సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పశుమిత్రులకు పనికి తగిన వేతనాలు నిర్ణయించి ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశు మిత్రులను యూనిఫాం, గ్లౌవజులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మందుల కిట్స్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకార్యాలు కల్పించాలని కోరారు. కృత్రిమ గర్భధారణ శిక్షణ ఇవ్వాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం తమ హక్కుల కోసం కృషి చేసే విధంగా ఒత్తిడి తీసుకురావాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో సమస్యపై మాట్లాడతామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మ, సురేఖ శ్రీలత, మనీషా, వరలక్ష్మి, అమృత, జయ పాల్గొన్నారు.

జనచైతన్య యాత్రను జయప్రదం చేయండి



నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కనికరం అశోక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండగుర్ల లింగన్న, నిర్మల్ జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ మతోన్మాద శక్తులను తెలంగాణలోకి రానియ వద్దన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. మతోన్మాదం నశించాలన్నారు. రేపు మంచిర్యాలలో నిర్వహించే జన చైతన్య యాత్ర బహిరంగ సభను పార్టీ నాయకులు కార్మికులు కలిసి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మగ్గిడి జయ, రాజేష్, రాజన్న, మల్లన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

టీఎస్పీఎస్సీ పేపర్ లీకులతో నష్టపోయిన నిరుద్యోగులకు బాసటగా నిలవాలని బీజేపీ ఆధ్వర్యంలో రాజధాని నగరంలోని గన్‌పార్క్ వద్ద రేపు నిర్వహించనున్న నిరుద్యోగ మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి విశ్రాంతిభవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఎస్పీఎస్సీ పరీక్షలు రాసిన నిరుద్యోగుల అందరికీ లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలని, పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనే ప్రధాన డిమాండ్లతో ఈ మహాధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఖానాపూర్ మండల అధ్యక్షుడు టేకు ప్రకాష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మామిడాల సుధాకర్, దస్తురాబాద్ మండల అధ్యక్షుడు కొడిమ్యాల లక్ష్మణ్, అసెంబ్లీ ఐటీ సోషల్ మీడియా డేటా కన్వీనర్ శ్రీధర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల ఉపేందర్ లతోపాటు జిల్లా నాయకులు తిరుమల్, సందుపట్ల శ్రవణ్, ఇనుముల స్వామి, దాసరి రాజేశ్వర్, నరేంద్రనాథ్, పంబాల ప్రశాంత్, సాయికిరణ్ లు పాల్గొన్నారు.

కబ్జా భూములను స్వాధీనం చేసుకుంటాం

నవతెలంగాణ-జన్నారం



మండలంలో ఏ గ్రామంలోనైనా ప్రభుత్వ భూములు కబ్జా అయిందని తెలిస్తే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ ఇట్యాల కిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని తపాలపూర్ గ్రామపంచాయతీలో గ్రామస్తులకు వివిధ పార్టీల నాయకులకు ప్రజలకు ప్రభుత్వ భూముల కబ్జాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తపాలాపూర్, సింగరాయపేట గ్రామాల్లో ఊర చెరువు భూములు కబ్జా చేసుకున్న వారి నుంచి పట్టాను రద్దుచేసి త్వరలో స్వాధీనం చేసుకుంటామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దన్నారు. అవి ఎప్పుడు పట్టాయినవి, ఎవరి పేరునా పట్టా అయింది ఎలా పట్టాయినవి పూర్తి వివరాలు సేకరించామన్నారు. వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వ పరంగా సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో జన్నారం ఎస్సై పి.సతీష్, చింతగూడ పీఏసీఎస్ చైర్మన కమ్మల విజయధర్మ, తపాలాపూర్ ఉప సర్పంచ్ రాజు, బీజేపీ నాయకులు కొమురయ్య, కాంగ్రెస్ నాయకులు మహేష్, బీఆర్ఎస్ నాయకులు రమేష్‌గౌడ్, వంశీ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల 49వ వార్షికోత్సవం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో 49వ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని సర్పంచ్ రాజన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, పాఠశాల చైర్మన్ సకారాం శుక్రవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమ్మర్‌గాం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, లోడ్‌పెల్లి సర్పంచ్ శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ సమీక్షా సమావేశం

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్య అధ్యక్షతన ఉపాధి హామీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా పల్లే ప్రగతిలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని అన్నారు. హరిత హారం మొక్కల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కూలీలకు పనుల కల్పన, ఆధార్ అనుసధానంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఎపీఓ సత్య ప్రసాద్, ఈసీ మధుకర్ పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని వృత్తి శిక్షణా కేంద్రంలో శ్రీరాంపూర్, మందమర్రి,ఎస్టీపీపీ లో సీనియర్ క్లర్క్‌లుగా, జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు, ఇంటర్నల్ రిక్రూట్మెంట్ ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా సెలెక్ట్ అయిన అభ్యర్థులకు పోస్టింగ్ కొరకు వెబ్ కౌన్సెలింగ్‌ను శుక్రవారం కొత్తగూడెం నుండి నిర్వహించారు. 65 మంది ఉద్యోగులకు గాను 62 మంది ఉద్యోగులు పాల్గొని మెరిట్, స్పౌస్ ఎంప్లాయ్మెంట్ ప్రకారం కౌన్సిలింగ్‌లో పాల్గొని పోస్టింగ్ పొందారు. ఈ కౌన్సిలింగ్ విధానంను ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఎస్ఓఎం వృత్తి శిక్షణ కేంద్రం కల్లూరి వెంకట రామారావు, ఐఈడీ ఎస్ఈ కిరణ్ కుమార్, సీనియర్ పీఓ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రపంచ క్షయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెరిగిపోతున్న క్షయ వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గించాలని అన్నారు. నిర్మూలన దిశగా ప్రణాళికలతో వైద్యసేవలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది స్ఫూర్తిదాయకంగా పనిచేసి వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు. యాక్టీవ్ కేసులను నిశితంగా పరిశీలిస్తూ, వ్యాధి వ్యాప్తి జరుగకుండా వివరించడం, విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే విధంగా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. వ్యాధి సోకిన వారికి కోర్సు ప్రకారం మందులు వాడే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. కొంతకాలం మందులు వాడినప్పటికి వ్యాధి తీవ్రత తగ్గదని, పూర్తి కోర్సు మందులు వాడటం వలన వ్యాధి అంతమవుతుందని అన్నారు. ముఖ్యంగా వ్యాధి ప్రబలే కారణాలపై పూర్తి విశ్లేషణ జరగాలని, తద్వారా వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు అవగాహన కల్పిస్తూ, వ్యాధి వ్యాప్తి జరుగకుండా క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యాధి సోకిన వారికీ ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ సామజిక బాధ్యతతో టీబీ నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు. టిబీ హరేగా.. దేశ్ జీతేగా.... అనే నినాదంతో ముందుకు వెళ్లాలని అన్నారు. ప్రోగ్రాం అధికారి డా.మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో డయేరియా, మలేరియా, వ్యాధి నిర్మూలనకు ప్రణాళికలతో చర్యలు తీసుకోడం జరిగి, తద్వారా జిల్లాలో వ్యాధుల ప్రభావం తగ్గిందని అన్నారు. సామజిక అవగాహనతోనే క్షయవ్యాధి నిర్మూలన జరుగుతుందని అన్నారు. వ్యాధులను అరికట్టడానికి జిల్లాలో వైద్య సైన్యం ఉందని, ఏ వ్యాధినైనా నిర్మూలించడానికి వైద్య సిబ్బంది కలిసి కట్టుగా పనిచేయాలని అన్నారు. రానున్న కాలంలో వైద్య రంగంలో అన్ని అంశాల ప్రగతిలో జిల్లాకు ప్రత్యేక స్థానం నిలిచేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని అన్నారు. సిరికొండ మండలం జెండగూడ గ్రామానికి చెందిన గెడం రాజు మాట్లాడుతూ క్షయవ్యాధితో బాధపడుతున్న తనకు స్థానిక వైద్య సిబ్బంది వైద్య చికిత్సలు అందించడం ద్వారా బతికి బయట పడ్డానని తెలిపారు. క్షయవ్యాధి నిర్మూలనకు విశిష్ట సేవలు అందించిన భీంపూర్, తలమడుగు, నార్నూర్ మెడికల్ ఆఫీసర్‌లకు, వివిధ ఆస్పత్రుల డాక్టర్ లకు, క్షేత్ర స్థాయి సిబ్బందికి ప్రశంస పత్రాలు, శాలువాలతో కలెక్టర్ సత్కరించారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సాధన, డాక్టర్లు, ఆశలు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.